PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 33 | విజయవాడ, శనివారం 2 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 2 September 2023 | Rs

రాష్ట్రంలో విద్యుత్ కోతలు

- డిమాండ్ తీర్చలేకపోతున్న డిస్కంలు
- తగ్గిన విండ్ పవర్

● లోపలి పేజీలో..●

అందరిలోనూ ఉత్కంఠ..!




- నేడు భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్
- మధ్యాహ్నం 3.00గం॥ల నుంచి

● లోపలి పేజీలో..

అండగా ఉంటాం

కౌలు రైతులకు ముఖ్యమంత్రి భరోసా

రైతున్నలకూ ఇబ్బంది రానివ్వం



క్యాంపు ఆఫీసులో రైతు భరోసా నమూనా చెక్కును విడుదల చేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగనీయకుండా చూస్తూ కౌలు దారులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్‌ఆర్ రైతు భరోసాలో భాగంగా లబ్ధిదారుల ఖాతాల్లో 11.01 కోట్ల రూపాయలను బటన్ నొక్కడం ద్వారా శుక్రవారం ఆయన జమ చేశారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐదో ఏడాది మొదట విడతగా కౌలు రైతులకు వైఎస్‌ఆర్ రైతు భరోసా కింద సిసిఆర్‌సి కార్డులు పొందిన 1,46,324మంది కౌలు రైతులు, దేవాదాయభూముల సాగుదారులుకు తొలి విడతగా వైఎస్‌ఆర్ రైతు భరోసా సహాయంగా రూ.109.01కోట్లు, పంట నష్టపోయిన 11,373మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.11.01కోట్లతో కలిపి రూ.120.75 కోట్ల ఆర్థిక సహాయాన్ని ఈ కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి కౌలు రైతుల కోసం మంచి చట్టాన్ని తీసుకొచ్చి రైతులెవరికీ ఎటువంటి నష్టం లేకుండా 11 నెలల పాటు సిసిఆర్‌సి కార్డులను గ్రామ సచివాలయాల్లోనే అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. తమ 50 నెలల పాలనలో దాదాపు 5.28లక్షల మంది కౌలు రైతులకు, 3.99లక్షల ఆర్‌ఓఎఫ్‌ఆర్ అంటే అటవీ భూములు సాగు చేసే గిరిజనులు మొత్తం క పి 9.22లక్షల మందికిమేలు చేస్తూ రూ.1122కోట్లు పెట్టుబడి సాయంగా అందించగలిగామన్నారు. ఇటీవల గోదావరి వరదలకు సంబంధించి రూ.11కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడమే కాకుండా రూ.38కోట్లు వరద సహాయం కింద సహాయం చేశామని సిఎం వెల్లడించారు. వరదల వల్ల నష్టపోయిన రైతులకు, నారుమళ్లు, నాట్లు వేసిన పొలాల రైతులందరినీ వెంటనే ఆదుకుంటూ మరలా పంట వేసుకునేందుకు 80శాతం రాయితీతో వరి విత్తనాలు ఆర్‌బికెల ద్వారా సరఫరా చేసి వారందరికీ అండగా ప్రభుత్వం నిలబడిందని సిఎం తెలిపారు. ఆర్‌బికెల్లో పంటలను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఉచిత పంటల బీమా 9 గంటల పాటు ఉచిత కరెంటు పగటి పూటే ఇస్తున్నట్లు తెలిపారు. రైతులకు అదనపు ఆదాయం రావాలనే ఉద్దేశ్యంతో సహకార వ్యవస్థలో మార్పులు చేస్తూ అమూల్‌ను తీసుకొచ్చామని సిఎం పేర్కొన్నారు. గోదావరి నది రిటైనింగ్ వాల్ పనులు వెంటనే ప్రారంభించాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాను సిఎం ఆదేశించారు. వీలైనంత వేగంగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. మరో వైపు కోల్డ్ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతి ఆర్‌బికెను ఒక యూనిట్‌గా తీసుకుని మ్యాపింగ్ చేయాలని, ప్రైమరీ ప్రాసెసింగ్‌ని తీసుకొస్తున్నట్లు సిఎం తెలిపారు. మామిడి తప్ప ఇప్పటికే బొప్పాయి, అరటితో సహా అన్ని పంటలు ఇన్సూరెన్స్ పరిధిలోకి తీసుకొచ్చామని సిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ,పశుసంవర్ధకశాఖ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు.

ఇక ప్రత్యామ్నాయ పంటలు

- వర్షాభావ పరిస్థితులే కారణం
- రైతులకు అవగాహన కల్పించండి : సిఎం ఆదేశం

● లోపలి పేజీలో..●



ముంబయిలో జరిగిన 'ఇండియా' సమావేశంలో పాల్గొన్న ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు

మోడీకి కౌంట్‌డౌన్ మొదలైంది

వీలైనంతవరకు ఉమ్మడిగా పోటీ.. ● సీట్ల సర్దుబాటుపై రాష్ట్రాలవారీగా చర్చలు

- 'భారత్ ఏకమవుతోంది... ఇండియా గెలుస్తుంది' ● ప్రచారంలో ఇదే నినాదం ● మూడు తీర్మానాలు, ● 14 మందితో సమన్వయ కమిటీ
- రెండు రోజుల ఇండియా ఫోరమ్ సమావేశం నిర్ణయాలు ● తదుపరి భేటీ ఢిల్లీలో...

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ముంబయి నుంచి కౌంట్ డౌన్ మొదలైందని ఇండియా ఫోరమ్ నేతలు ఉద్ఘాటించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో మతతత్వ బిజెపిని మట్టికరిపించడమే లక్ష్యంగా సాధ్యమైనంతవరకు ఉమ్మడి అభ్యర్థులను నిలబెట్టనున్నట్లు ప్రకటించింది. ముంబయిలో రెండు రోజుల పాటు జరిగిన 28 ప్రతిపక్ష పార్టీల ఫోరమ్ సమావేశం శుక్రవారం ఈ మేరకు తీర్మానించింది. ఇందుకోసం రాష్ట్రాల వారీగా సీట్ల సర్దుబాటు చర్చలు సత్వరమే చేపట్టాలని, దీంట్లో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ప్రదర్శించాలని సమావేశంలో నిర్ణయించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులతో సమన్వయ కమిటీ, ప్రచార కమిటీ, మీడియా కమిటీతో పాటు సామాజిక మాధ్యమాల కార్యాచరణ బృందాన్ని మొత్తం అయిదు కమిటీలను ఏర్పాటు చేశారు. ఇండియా ఫోరమ్ తదుపరి భేటీ ఢిల్లీలో నిర్వహించనున్నట్లు నేతలు తెలిపారు. చంద్రయాన్ ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రో బృందాన్ని ఇండియా ఫోరమ్ ప్రత్యేకంగా అభినందించింది. సమావేశ తీర్మానాలను శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) నేత ఆదిత్య ఠాక్రే ముంబయిలో విలేకరుల సమావేశంలో చదివి వినిపించారు.

'ఇండియా ఏకమవుతోంది... ఇండియా గెలుస్తుంది' అన్న థీమెటిక్ నినాదంతో ప్రతిపక్ష కూటమి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుంది. ప్రజా ప్రాధాన్యత కలిగిన అంశాలు, ప్రజా సమస్యలపై దేశంలోని వివిధ ప్రాంతాలలో సాధ్యమైనంత త్వరగా ర్యాలీలు చేపడుతుంది. సమన్వయ కమిటీలో కెసి వేణుగోపాల్ (కాంగ్రెస్), శరద్ పవార్ (ఎన్‌సిపి), స్టాలిన్ (డిఎంకె), తేజస్వీ యాదవ్ (ఆర్జేడి), రాఘవ్ చద్దా (అమ్‌ఆద్మీ), అభిషేక్ బెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), జావేద్

మిగతా 5లో

'ఇండియా' మరింతగా విస్తరిస్తుంది : సీతారాం ఏచూరి

ప్రతిపక్ష పార్టీలన్నీ ఐక్యమవుతుండడం బిజెపికి గుబులు పుట్టిస్తోందని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ముంబయిలో 'ఇండియా' ఫోరమ్ రెండు రోజుల సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ వేదిక రోజురోజుకు విస్తరిస్తున్నదని, మరిన్ని పార్టీలు ఇందులో చేరనున్నాయని తెలిపారు. సీట్ల సర్దుబాటు రాష్ట్రాల స్థాయిలోనే ఉంటుందని , తామంతా ఐక్యంగా ఉన్నామనే సందేశాన్ని ఈ సమావేశం తెలియజేసిందని అన్నారు. ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం, న్యాయం వంటి రాజ్యాంగం ఇచ్చే హామీలను నిలబెట్టాల్సిన అవసరముందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్న లక్ష్యంతోనే తామంతా ఐక్యంగా ఉన్నామని పేర్కొన్నారు. ఇండియా ఫోరం కర్ణాటకలో సమావేశం అయినప్పుడు, అకస్మాత్తుగా ఎన్‌డిఎ సమావేశం జరిగిందని, ఇప్పుడు ముంబయిలో ఇండియా సమావేశం అవుతున్న నేపథ్యంలో గ్యాస్ ధర రూ.200 తగ్గించారని అన్నారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ప్రకటించిన ప్రభుత్వం, ఎజెండా ఏమిటో వెల్లడించలేదని అన్నారు. లౌకిక శక్తులన్నీ ఏకం కావడం బిజెపి, ప్రధాని మోడీని కలవరపెడుతోందన్నారు.

ధర్నాలకు హైకోర్టు అనుమతి

10న విద్యుత్, 17న సిపిఎస్ ఉద్యోగుల ఆందోళనలు

ప్రజాశక్తి-అమరావతి



ఉద్యోగుల ధర్నాలకు హైకోర్టు అనుమతినిచ్చింది. పలు సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ కార్మిక సంఘాలు ఈ నెల 10న విజయవాడలో ధర్నా, నిరసన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు, సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్ సాధన కోసం 17న విజయవాడలో సమావేశం నిర్వహించుకునేందుకు ఉద్యోగులకు అనుమతిచ్చింది. సమావేశానికి హాజరయ్యే వారి ఆధార్ కార్డు వివరాలు పోలీసులకు అందజేయాలని నిర్వాహకులను ఆదేశించింది. ఐదు వందల మందితో మాత్రమే నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని షరతు విధించింది. విద్యుత్ ఉద్యోగులు పదో తేదీన ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల మధ్యకాలంలో ధర్నా, నిరసన కార్యక్రమాలను పూర్తి చేయాలంది. రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, విద్వేషపూరితంగా మాట్లాడరాదని షరతు విధించింది. ఈ మేరకు జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు అనుమతి కోరితే పోలీసులు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ పలు సంఘాలు హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశాయి. విజయవాడలోని ధర్నా చౌక్ లేదా జింఖానా గ్రౌండ్‌లో ధర్నా చేసేందుకు విజయవాడ పోలీస్ కమిషనర్ నిరాకరించడాన్ని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కమిటీ తరఫున న్యాయవాది నల్లూరి మాధవరావు వాదించారు. సిపిఎస్ ఉద్యోగులు నిరసనలు, ర్యాలీలు నిర్వహించరాదని హైకోర్టు షరతు విధించింది. విద్యుత్ ఉద్యోగుల ధర్నాకు విధించిన అన్ని షరతులూ సిపిఎస్ ఉద్యోగుల సమావేశానికి వర్తిస్తాయని పేర్కొంది. ర్యాలీకి అనుమతివ్వలేదు. వైఎస్ జగన్ విపక్ష నేతగా ఉండగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎస్ ఉద్యోగులు ప్రైవేట్ స్థలంలో సమావేశం నిర్వహించుకునేందుకు ప్రయత్నించారు. అందుకు పోలీసులు అనుమతివ్వకపోవడంతో సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ మహ్మద్ హుస్సేన్ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనరు తరఫున న్యాయవాది ఇంద్రనీల్‌బాబు వాదించారు.



పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలో ఖాళీగా ఉన్న పొలాలు

సాగర్ ఆయకట్టులో వరికి ఉరి

- ఆరుతడి పంటలు వేసుకోండి
- జలవనరుల, వ్యవసాయ శాఖ అధికారుల ప్రచారం
- వేసిన పంటలు కాపాడుకోవడానికి రైతులకు ప్రయాస

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోని కృష్ణా పరివాహక ప్రాంతంలో ఈ ఏడాది వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకుంది. ప్రధానంగా నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో సేద్యానికి నీరు ఇవ్వలేమని జలవనరుల శాఖ ఒంగోలు ఎస్ఇ ప్రకటించారు. కేవలం వర్షాధార పంటలు మాత్రమే వేసుకోవాలని బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తెలియజేశారు. ఈ మేరకు మీడియాలో ప్రచారం చేశారు. దీంతో, రైతుల్లో ఆందోళన నెలకొంది. సాగర్ ఆయకట్టు పరిధిలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో కుడి కాలువ కింద 11 లక్షల ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా. ప్రకాశం జిల్లాలో 38 వేల ఎకరాలు, పల్నాడు జిల్లాలో 1.22 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేశారు. ఇప్పటి వరకూ ఈ రెండు జిల్లాల్లో కేవలం 8 వేల ఎకరాల్లోనే వరిని వేశారు.

గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కూడా కుడి కాలువ కింద కొంత ఆయకట్టు ఉంది. కాలువలకు నీరు వచ్చే అవకాశాన్ని బట్టి 40 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. సాగర్ జలాశయంలో గరిష్ట నీటి నిల్వలో సగం కూడా లేకపోవడంతో వరి సాగుకు అనుమతి ఇవ్వరాదని జలవనరుల శాఖ నిర్ణయించింది. ఎగువ నుంచి నీటి ప్రవాహం రాకపోవడంతో సాగర్ జలాశయంలో గత రెండు నెలల్లో నిల్వ

మిగతా 2లో

నేడు ఆదిత్య ప్రయోగం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

సూర్యుడిపై పరిశోధనల కోసం ఇస్రో చేపట్టిన ఆదిత్య ఎల్-1 ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ శుక్రవారం మధ్యాహ్నం 12.20 గంటలకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్‌లో ప్రారంభమైంది. 23 గంటలపాటు నిర్విరామంగా కౌంట్‌డౌన్ కొనసాగనుంది. అనంతరం శనివారం ఉదయం 11.50 గంటలకు అదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని మోసుకుంటూ పిఎస్‌ఎల్‌వి సి-57 నింగిలోకి



దూసుకెళ్లనుంది. దీని ప్రయాణం 125 రోజులు ఉంటుంది. సూర్యునికి సమీపంలోకి చేరుకున్నాక అక్కడి వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రత మార్పులపై పరిశోధనలు చేయనుంది. కరోనాగ్రఫీ పరికరం సాయంతో సౌర వాతావారణాన్ని లోతుగా పరిశోధించడానికి ఈ ప్రయోగం చేపట్టారు.

ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నిక చెల్లదు

- కర్ణాటక హైకోర్టు తీర్పు

బెంగళూరు : లోక్‌సభ ఎంపీగా మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, జెడిఎస్ నాయకుడు ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నిక చెల్లదని కర్ణాటక హైకోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. వచ్చే ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత విధిస్తున్నట్లు జస్టిస్ కె.నటరాజన్ ఏకసభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో హసన్ నియోజకవర్గం అభ్యర్థిగా నామినేషన్ వేసినప్పుడు అఫిడవిట్‌లో తన ఆస్తులను పూర్తిగా వెల్లడించకుండా అవకతవకలకు పాల్పడ్డారని ధ్రువీకరించింది.


హసన్ నియోజకవర్గ ఓటరు జి. దేవరాజెగౌడ, బిజెపి అభ్యర్థి ఎ.మంజు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు విచారించింది. హసన్ నియోజకవర్గంలో ఓట్ల సంఖ్యలో రెండోస్థానంలో ఉన్న మంజు కూడా అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నందున ఆయన ఎన్నికైనట్లు ప్రకటించలేమని స్పష్టం చేసింది. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడినందుకు ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ, సోదరుడు సూరజ్‌పైనా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది.

కోవింద్ నేతృత్వంలో జమిలి కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, శాసనసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ విధానం ఆచరణ సాధ్యమేనా? దీనిని అమలు చేయడానికి తీసుకోవలసిన చర్యలేమిటి? వంటి అంశాలను అధ్యయనం చేసేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ దేశంలోని రాజకీయ పార్టీలతోనూ, రాష్ట్రాలతోనూ విస్తృత స్థాయిలో చర్చలు జరుపుతుంది.

లోక్‌సభ ఎన్నికలకు కొన్ని నెలల ముందు, వెనుకగా 13 రాష్ట్రాల శాసన సభల ఎన్నికలు జరగవలసి ఉంటుంది. కేంద్రం తీరుతో ఈ రాష్ట్రాల ఎన్నికలపై ప్రభావం పడుతుంది. 'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలు' కోసం చట్టాన్ని తీసుకురావాలంటే శాసన పరిశీలన సంఘం ద్వారా సిఫారసులను పొందవలసి ఉంటుంది. అందుకు భిన్నంగా ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేయడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం లేదని కొందరు చెప్తు న్నారు. ఇప్పటికే దీనిని ప్రతిపక్షాలు



వ్యతిరేకిస్తున్నాయి.

రాష్ట్రాలను ఒప్పించాలి

లోక్‌సభ ఎన్నికలు షెడ్యూలు ప్రకారం జరుగుతాయని అనుకుంటే, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒరిస్సా, సిక్కిం శాసన సభల ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోపాటే జరగవలసి ఉంది. ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, మిజోరాం, తెలంగాణ, రాజస్థాన్ శాసన సభల ఎన్నికలు లోక్‌సభ ఎన్నికల కన్నా ఐదు నెలల ముందుగానే జరగవలసి ఉంది. మరోవైపు హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఢిల్లీ శాసన సభల ఎన్నికలు లోక్‌సభ ఎన్నికల అనంతరం 5 నుంచి 7 నెలల్లోగా జరగవలసి ఉంది. ఈ రాష్ట్రాలన్నిటితోనూ సంప్రదించి, లోక్‌సభ ఎన్నికలతోపాటు శాసన సభల ఎన్నికల నిర్వహణకు ఒప్పించడం సాధ్యం కావచ్చు. కానీ మిగిలిన 15 రాష్ట్రాల పరిస్థితి వేరుగా కనిపిస్తోంది. వీటిలో కొన్ని రాష్ట్రాల శాసన సభల పదవీ కాలం ఒక ఏడాది నుంచి నాలుగేళ్ల వరకు ఉంది. ఉదాహరణకు, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు ఈ ఏడాదిలోనే ఎన్నికలు జరిగాయి. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం రాష్ట్రాల్లో 2022లో ఎన్నికలు జరిగాయి. ఈ 15 రాష్ట్రాల్లో ఒకే పార్టీ ప్రభుత్వాలు లేవు. కొన్నిటిలో బిజెపి, మరికొన్నిటిలో కాంగ్రెస్, ఇతర పార్టీలు, కూటములు అధికారంలో ఉన్నాయి. ఈ పార్టీలు ఇప్పటికే వ్యతిరేకిస్తున్నాయి కాబట్టి అధికారాన్ని ముందు గానే వదులుకోవడానికి ఇష్టపడే అవకాశం లేదు.

పార్లమెంట్ తో పాటు రాష్ట్రాల్లో మెజార్టీ అవసరం

'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలు' బిల్లు ఆమోదం పొందాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి. దీనికి సంబంధించిన బిల్లుకు పార్లమెంట్‌లోని ఉభయ సభల్లోనూ మూడింట రెండొంతుల మంది ఎంపిల మద్దతు తప్పనిసరి. దేశంలోని 50 శాతం రాష్ట్రాలు దీనిని ఆమోదించాలి. లోక్‌సభ సభ్యుల్లో 67 శాతం మంది, రాజ్యసభ సభ్యుల్లో 67 శాతం మంది మద్దతివ్వాలి.

నోటీసులపై చంద్రబాబు స్పందించాలి

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని నిర్మాణంలో బినామీల ద్వారా కమీషన్ తీసుకున్నారని ఆరోపిస్తూ.. ఆదాయపు పన్నుశాఖ ఇచ్చిన నోటీస్‌పై టిడిపి అధినేత చంద్రబాబు స్పందించాలని మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు అడ్డదారిలో బోగస్ కాంట్రాక్టుల ద్వారా ప్రజాధనాన్ని మళ్లించి చంద్రబాబు తన ఖాతాలో జమ చేసుకున్నారని విమర్శించారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి వుంటే హిందుస్తాన్ టైమ్స్‌లో వచ్చిన కథనంపై స్పందించాలన్నారు. రాజధాని అమరావతి నిర్మాణంలో ఎల్‌అండ్‌టి, పల్లోంజీ మిస్త్రీ సంస్థల సబ్ కాంట్రాక్టులతో రూ.118 కోట్ల ముడుపులు తీసుకున్నారని విమర్శించారు. పాదయాత్రలో వున్న నారా లోకేష్ తన తండ్రిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై స్పందించాలని డిమాండ్ చేశారు. 14 ఏళ్లు సిఎంగా వున్నప్పుడు రాష్ట్ర ప్రజలకు ఏమీ చేయని చంద్రబాబు మరోసారి మోసపూరిత మేనిఫెస్టోతో వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

జమిలీ ఎన్నికలను స్వాగతిస్తాం

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రం జమిలి ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన చేస్తోందని, ఒక వేళ 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' అనే నినాదంతో ఎన్నికలకు వెళితే తాము స్వాగతిస్తామని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరిగితే మంచి సందేశం వెళ్తుందని గతంలో లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయని అన్నారు. ఈ నెల 2న జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా భవన నిర్మాణ కార్మికులతో కలిసి పవన్‌కళ్యాణ్ సహపంక్తి భోజనాలు చేస్తారని తెలిపారు.

చంద్రబాబుకు 'గోనుగుంట్ల' శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ నేత గోనుగుంట్ల కోటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు మొదటిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి శనివారం నాటికి 28 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా టిడిపి కార్యాలయంలో చంద్రబాబుకు ఆయన పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

సాగర్ ఆయకట్టులో వరికి ఉరి


(మొదటి పేజీ తరువాయి)

పెరగడం లేదు. దీంతో, డెడ్ స్టోరేజీ స్థాయికి పడిపోయే ప్రమాదం ఉండడంతో తాగునీటికి మాత్రమే నీరు ఇస్తామని, వ్యవసాయానికి ఇవ్వలేమని అధికారులు ప్రకటించారు. గత నాలుగేళ్లుగా ఇదే సమయానికి కృష్ణా పరివాహక ప్రాంతంలోని అన్ని జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మరోవైపు సాగర్ ఆయకట్టు పరిధిలో 30 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో, పత్తి, మిర్చి తదితర పంటల సాగు కూడా ప్రశ్నార్థకమైంది. ఇప్పటికే వేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలుపడుతున్నారు. పల్నాడు జిల్లాలో 1.22 లక్షల ఎకరాలకుగాను కేవలం 4,900 ఎకరాల్లో, ప్రకాశం జిల్లాలో 37 వేల ఎకరాలకుగాను కేవలం 3,100 వేల ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు వేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 4.80 లక్షల ఎకరాలకుగాను 1.78 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. వేసిన పంటలు బెట్టకు రావడంతో సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాశం జిల్లాలో 85 వేల ఎకరాలకుగాను 31 వేల ఎకరాల్లో పత్తి వేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో మిర్చి సాగవుతుందని అంచనా. ఈ ఏడాది ఇప్పటి వరకు 15 వేల ఎకరాల్లోనే సాగు ప్రారంభించారు. సాగర్ జలాశయంలో నీరు లేకపోవడంతో పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఈ ఏడాది మిర్చి సాగు ఇంతవరకు ఊపందుకోలేదు. మిర్చికి తప్పనిసరిగా రెండుమూడు తడులకు నీటి అవసరం ఉంది. సాగర్ నుంచి నీరు రాకపోతే మిర్చి దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. దీంతో, రైతులు మిర్చి సాగుకు ధైర్యంగా ముందుకు వెళ్లలేకపోతున్నారు. సెప్టెంబరు వచ్చినా వర్షాలు కూడా నిరాశాజనకంగా ఉండడంతో వారిలో తీవ్ర ఆందోళన నెలకొంది. శ్రీశైలం జలాశయం గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసిలు కాగా, శుక్రవారం నాటికి 84.66 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. గతేడాది ఇదే రోజుకు 215.81 టిఎంసిల నీరు నిల్వ ఉంది. సాగర్ జలాశయ గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 312.04 టిఎంసిలు. ప్రస్తుతం 154.99 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. గతేడాది ఇదే రోజుకు 310.85 టిఎంసిల నీరు నిల్వ ఉంది.

రాష్ట్రంలో విద్యుత్ కోతలు

- డిమాండ్ తీర్చలేకపోతున్న డిస్కంలు
- తగ్గిన విండ్ పవర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు తగ్గ అవసరాన్ని డిస్కంలు తీర్చలేకపోతున్నాయి. దీంతో అప్రకటిత కోతలను డిస్కంలు విధిస్తున్నాయి. లోడ్ రిలీఫ్ పేరుతో కోతలు విధించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కోతలు పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి. లోడ్ రిలీఫ్ పేరుతో విధిస్తున్న అప్రకటిత కోతలతో ప్రజలు గురువారం నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం 240.4 మిలియన్ యూనిట్ల(ఎంయు)ల విద్యుత్ డిమాండ్ ఉండగా ఇందులో 4.49 ఎంయుల మేర డిస్కంలు కోతలు విధించాయి. ఇపిడిసిఎల్ పరిధిలో గురువారం 1.938ఎంయులు, ఎస్‌పిడిసిఎల్ పరిధిలో 2.190 ఎంయులు చొప్పున కోతలు ఉన్నాయి. శుక్రవారం డిమాండ్ 231.6 మిలియన్ యూనిట్లు కాగా, ఇందులో 5.51 ఎంయుల కొరత ఉంది. ఇపిడిసిఎల్ పరిధిలో 2.850ఎంయులు, ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్ పరిధిలో 2.656 చొప్పున కోతలు ఉన్నాయి. ఆగస్టు నెలలో మొత్తం 6 రోజులు 5 మిలియన్ యూనిట్లు(ఎంయులు)పైగా కోతలు విధించాయి. 10 రోజుల పాటు ఒక మిలియఎ యూనిట్ల చొప్పున కోతలు విధించాయి. సుమారు 70 మిలియన్ యూనిట్ల వరకు డిస్కంలు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం పీక్ అవర్‌లో యూనిట్ ధర రూ.10ల చొప్పున ఉంది. అసాధారంగా నెలకొన్న అధిక ఉష్ణోగ్రతల వల్ల విద్యుత్ డిమాండ్‌ను తీర్చలేకపోతున్నామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాకాలంలో పవన విద్యుత్ ఉత్పత్తి సుమారు 40 ఎంయుల వరకు ఉంటుందని ప్రస్తుతం ఇది 10 ఎంయుల లోపే ఉంటుందని అంటున్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని వీలైనంత మేర పగటి సమయంలోనే కోతలు విధిస్తున్నామని చెబుతున్నారు. మరో రెండు రోజుల వరకు కోతలు విధించే అవకాశం ఉందని వెల్లడించారు. ఆగస్టులో అధిక ఉష్ణోగ్రతలు ఎప్పుడూ లేనంతగా ఉన్నాయని, అందువల్లే కొంత కోతలు విధించాల్సి వస్తుందని చెబుతున్నారు.

ప్లాంట్లలో అడుగంటిన బొగ్గు నిల్వలు

థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో బొగ్గు నిల్వలు అడుగంటాయి. నిబంధనల ప్రకారం 15 రోజులకు సరిపడ బొగ్గు అంటే ఉండాలి. బొగ్గు కొరత ఉండటంతో ప్లాంట్లను పూర్తిస్థాయిలో నడపలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో జెన్‌కో ఆధ్వర్యంలో మూడు థర్మల్ ప్లాంట్లు నడుస్తున్నాయి. నెల్లూరులోని కృష్ణపట్నం ప్లాంట్ రోజుకు 19000 మెట్రిక్ టన్ను(ఎంటి)ల బొగ్గు అవసరం. అయితే ఇక్కడ 6,33,47 ఎంటిలు మాత్రమే అందుబాటులో ఉంది. ఇది కేవలం మూడు రోజులకు మాత్రమే వస్తుంది. రాయలసీమ ప్లాంట్‌కు రోజు 21వేల ఎంటిలు అవసరం కాగా ప్రస్తుతం అక్కడ 46670 ఎంటిలు అంటే రెండు రోజులకు సరిపడ మాత్రమే ఉంది. విటిపిఎస్ ప్లాంట్‌కు రోజుకు 28500 ఎంటిలు అవసరంగా కాగా ప్రస్తుతం అక్కడ 71,313 ఎంటిలు అంటే రెండున్నర రోజులకు సరిపడ మాత్రమే ఉంది.

దేశవ్యాప్తంగా పెరిగిన డిమాండ్: సిఎం జగన్

ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉండటంతో విద్యుత్ డిమాండ్ దేశవ్యాప్తంగా అనూహ్యంగా పెరిగిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. అయినా ఎక్కడా కూడా రైతులకు, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చేసేందుకు అన్ని రకాలుగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వర్షాల కొరత నేపథ్యంలో నిర్వహించిన సమీక్షలో శుక్రవారం ఆయన ఈ విషయం ప్రస్తావించారు. యూనిట్ ధర రూ.7.52లు పెట్టి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఆగస్టులో రూ.966.09 కోట్లు విద్యుత్ కొనుగోలు చేశామని, ఎండలు అధికంగా ఉండే మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలో కూడా ఇంత ఖర్చు చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా 231 గిగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడిందని అధికారులు సిఎంకు తెలిపారు. గతేడాదితో పోలిస్తే గ్రిడ్ డిమాండ్ 18శాతం వరకూ పెరిగిందని వివరించారు. గాలి లేనందున పవన విద్యుత్ గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. తడి బొగ్గు రావడంతో సామర్థ్యం మేరకు థర్మల్ కేంద్రాలు విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు.

పునరావాస జాప్యానికి నిధుల కొరతే కారణం

- గుర్తించిన ప్రాంతాలకే ఇంకా రూ.1340 కోట్లు అవసరం
- స్పందించని కేంద్ర ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో సహాయ పునరావాస పనులు నిధుల కొరత కారణంగానే నత్తనడకన సాగుతున్నాయి. ఇది కొత్త విషయం కానప్పటికీ నీటిపారుదల శాఖ అధికారులు కూడా కొంత కాలంగా అంతర్గత లేఖల్లో ఈ విషయాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఇప్పటివరకు అధికారికంగా గుర్తించిన ముంపు ప్రాంతాల ప్రజానీకానికి పునరావాస పనులు పూర్తిచేయడానికి కనీసం 1,340 కోట్ల రూపాయలు అవసరమని నీటిపారుదల శాఖ అధికారులు తమ లేఖల్లో పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకుపోయి నిధులు విడుదల చేయాలని కోరినా ఫలితం కనిపించడం లేదు. కేంద్ర ప్రభుత్వంలో నామమాత్రపు స్పందన కూడా కనిపించడం లేదని అధికారులు అంటున్నారు. నీటిపారుదలశాఖ అధికారుల లెక్కల ప్రకారం పోలవరం ముంపు ప్రాంతాల బాధితుల కోసం 13,938 ఇళ్ల నిర్మాణం చేపట్టగా, ఇందులో 11,547 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన 2391 ఇళ్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. ఆ తరువాతే మొత్తం 12,658 కుటుంబాల తరలింపు పూర్తి చేయాల్సి ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తం ప్రక్రియకు ఇంకా 1340 కోట్లు కావాల్సి ఉంటుందని వారు ప్రతిపాదించారు. ఇదే సమయంలో నిర్మాణం పూర్తయిన 11,547 ఇళ్లకు సంబంధించి 557 బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి సంబంధించి 716 కోట్లు చెల్లించాల్సి ఉందని వారు చెబుతున్నారు. ఇందులో ఆర్ ఆర్ కాలనీ పనులకోసం 164 కోట్లు, నగదు చెల్లింపులకు 335 కోట్లు, కెనాల్స్ పనుల కోసం కోటి, ఆర్‌ఆర్ పనుల్లో భూసేకరణ కోసం 29 కోట్లు, భూ పరిహారం కింద 96 కోట్లు, ఇతర నగదు చెల్లింపుల కోసం 92 కోట్లు చెల్లించాల్సి ఉంది.కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులను సకాలంలో చెల్లించలేకపోవడమే పనులు సకాలంలో పూర్తికాకపోవడానికి కారణమని అధికారులు అంటున్నారు.

త్వరలో 'ఆరోగ్య సురక్ష'

- రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు యునిసెఫ్ సంసిద్ధత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

త్వరలో 'ఆరోగ్య సురక్ష' పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఇదే విషయాన్ని చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ స్టేట్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ యునిసెఫ్ ఫీల్డ్ ఆఫీస్ చీఫ్ డాక్టర్ జిలాలేమ్, బి తాపస్సీ సిఎంను కలిశారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయాలకు అనుసంధానంగా వైద్య, ఆరోగ్య రంగంలోని వివిధ స్థాయిల్లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు యునిసెఫ్ సంసిద్ధత వ్యక్తం చేసింది. వివిధ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను యునిసెఫ్ బృందంతో సిఎం చర్చించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందుకు వెళుతున్న తీరును యునిసెఫ్ బృందం అభినందించింది. ప్రైమరీ హెల్త్ కేర్‌లో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పి), ఫ్యామిలీ ఫిజీషియన్, ఆశా, అంగన్‌వాడీ వర్కర్స్, ఎఎన్‌ఎమ్, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ వంటి వివిధ స్థాయిల్లో ప్రభుత్వానికి అవసరమైన విధంగా తోడ్పాటునందించేందుకు యునిసెఫ్ ముందుకొచ్చింది. ఈ సమావేశంలో యునిసెఫ్ హెల్త్ స్పెషలిస్ట్ ఆర్‌పి శ్రీధర్, సోషల్ బిహేవియర్ ఛేంజ్ స్పెషలిస్ట్ సీమ, సిఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్‌శర్మ, సిఎం స్పెషల్ సిఎస్ పూనం మాలకొండయ్య, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనరు జానకి పాల్గొన్నారు.

ఇక ప్రత్యామ్నాయ పంటలు

- వర్షాభావ పరిస్థితులే కారణం
- రైతులకు అవగాహన కల్పించండి : సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో వర్షాభావ పరిస్థితులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత, విద్యుత్ సమస్యలపై చర్చించారు. ఆగస్టు నెల ముగిసినా ఆశించిన రీతిలో వర్షాలు కురవలేదని, ఈ పరిస్థితుల్లో సాంప్రదాయ పంటల సాగు అంత మంచిది కాదన్న అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైంది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు కురిసినా ఒకటి, రెండు జిల్లాల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో వ్యవసాయానికి అంతగా ఉపయోగపడదని అధికారులు వివరించారు.

జూన్ నుండి ఆగస్ట్ వరకు 419.6 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సి వుండగా 314.6 మిల్లీమీటర్లు కురిసిందని అధికారుల చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 25శాతం వర్షపాతం లోటు వుందని సిఎం దృష్టికి తీసుకువచ్చారు.

కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, ఎన్‌టిఆర్, నెల్లూరు, తిరుపతి, పల్నాడు, ప్రకాశం, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వర్షాభావం వుందని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వున్న సాగునీటి ప్రాజెక్టుల సామర్థ్యం 1174.58 టిఎంసీలు కాగా ఇపుడు 507 టిఎంసీలు మాత్రమే వుందని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి కోసం శ్రీశైలం ప్రాజెక్టు నుండి తెలంగాణ ప్రభుత్వం నీటిని కిందకు విడిచిపెడుతోంద్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికకు విస్తృత ప్రచారం కల్పించాలని, రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రత్యామ్నాయ ప్రణాళికపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు.

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉలవలు, బొబ్బర్లు, మినుములు, పెసలు, కందులు, కొర్రలు, రాగి, జొన్న, మొక్క జొన్న, బాజ్రా, సన్ ఫ్లవర్ లాంటి పంటలను ప్రోత్సహించేలా విత్తనాలను సిద్ధంచేసి వుంచాలని అన్నారు. 80శాతం సబ్సిడీతో రైతులకు ఈ విత్తనాలను అందించాలన్నారు. అలాగే పశువులకు దాణా, గ్రాసాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. పశుగ్రాసానికి కొరత రానివ్వరాదని అన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఎపి ఎంఎస్‌పి యాక్ట్ ప్రవేశపెడుతున్నామని తెలిపారు. రైతులకు నిర్ణయించిన కనీస మద్దతు ధర ఇవ్వకుంటే ఈ చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం వుంటుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి వ్యవసాయ, జలవనరులు, పశు సంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

పట్టణాల్లో ఆన్‌లైన్ సేవలకు రెండు ఉన్నతస్థాయి కమిటీలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ సేవా విధానాన్ని మెరుగుపరిచేందుకు రెండు ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటుచేశారు. ఈ మేరకు పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులను జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన హైపవర్ స్టీరింగ్ కమిటీని ఏర్పాటుచేస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందులో పట్టణాభివృద్ధి, ఐటి, ఆర్థిక, పట్టణ స్థానిక సంస్థల కార్యదర్శులు, డైరెక్టర్లు, పట్టణ స్థానిక సంస్థల నుంచి ఎంపిక చేసిన కమిషనర్లు, ఎన్‌యుడిఎం నుంచి నోడల్ అధికారి, ఎన్‌ఐయుఏ డైరెక్టర్, గ్రామ, వార్డు సచివాలయాల ప్రాజెక్టు డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆరు నెలలకు ఒకసారి భేటీ అయి సమీక్షించాల్సి ఉంటుంది. అలాగే అంతర్ శాఖల అనుసంధానం, ఐటి శాఖలో తీసుకురావాల్సిన మార్పులు వంటి వాటిపై సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు తీసుకుంటారు.

పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షునిగా రాష్ట్ర స్థాయి అమలు కమిటీని ఏర్పాటుచేశారు. ఇందులో ఐటి శాఖ, ఆర్థికశాఖ, స్థానిక సంస్థలశాఖ, ఎంపిక చేసిన పట్టణాభివృద్ధి సంస్థల కమిషనర్లు, ఇతరులతో ఈ కమిటీ ఉంటుంది. ఈ కమిటీ రెండు నెలలకు ఒకసారి భేటీ కావాల్సి ఉంటుంది. ఈ పథకంలో పురోగతిని చర్చించి, తీసుకోవాల్సిన సంస్కరణలను సిఫార్సు చేయాల్సి ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉరవకొండ

అప్పులబాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా విడపనకల్లు మండలంలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు... పెద్దకొట్టాలపల్లి గ్రామానికి చెందిన దేవేంద్ర(63) ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశారు. సాగు నిమిత్తం రూ.ఐదు లక్షలు అప్పు చేశారు. రెండు సంవత్సరాలుగా పంటలు చేతికందకపోవడంతో అప్పుల భారం అధికమైంది. ఈ ఏడాది కూడా పంట దక్కకపోవడంతో రెండురోజుల క్రితం ఇల్లు వదిలి వెళ్లిపోయారు. దేవేంద్ర ఆచూకీ కుటుంబ సభ్యులు, బంధువులు వెతకసాగారు. ఈ క్రమంలో గ్రామ శివారులో ఉన్న బావిలో దేవేంద్ర మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అప్పుల బాధలు భరించలేకనే తన భర్త బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారని మృతుని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'వర్సిటీ'ల్లో 3,480 పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో రేషనలైజేషన్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు ఉత్తర్వులు విడుదల చేసింది. మొత్తం 16 యూనివర్సిటీల్లో పోస్టుల భర్తీకి సంబంధించిన జిఓలను ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె శ్యామలరావు శుక్రవారం విడుదల చేశారు. మొత్తం 3,480 పోస్టులు భర్తీ చేయాలని పేర్కొన్నారు. వీటిల్లో 1,979 అసిస్టెంట్ ప్రొఫెసర్, 960 అసోసియేట్ ప్రొఫెసర్, 541 ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అనుమతులు మంజూరు చేశారు. యూనివర్సిటీల వారీ ఖాళీల వివరాలను జిఓల్లో పొందుపరిచారు.

బీమా క్లెయిమ్స్‌ను సకాలంలో పరిష్కరించాలి

- జిఎస్‌డబ్ల్యుఎస్ ఎమ్‌డి లక్ష్మీశా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా అర్హులైన వారికి క్లెయిమ్స్ సకాలంలో పరిష్కరించాలని అధికారులను గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఎమ్‌డి లక్ష్మీశా ఆదేశించారు. విజయవాడలోని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం బీమా రాష్ట్ర స్థాయి నోడల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీమా దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డైరెక్టర్ సోము నారాయణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దగ్ధం



విద్యుత్ బిల్లుతో విశాఖలో నిరసన తెలుపుతున్న నాయకులు

- ఛార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళనలు
- గ్రామ సచివాలయాల ఎదుట నిరసనలు
- మూడవరోజు కొనసాగిన సిపిఎం సమరభేరీ

ప్రజాశక్తి - యంత్రాంగం

నిత్యావసర ధరలు, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఆయా సచివాలయాల ఎదుట నిరసనలు తెలిపి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సిపిఎం తలపెట్టిన సమరభేరీ కార్యక్రమంలో భాగంగా మూడవరోజైన శుక్రవారం విద్యుత్ భారాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతపురం టవర్‌క్లాక్ సచివాలయం వద్ద విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తోందని విమర్శించారు. ప్రకాశం జిల్లా పంగులూరులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మోడీ హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి క్రమేపీ నిధులు తగ్గిస్తూ వస్తున్నారని తెలిపారు. ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపే భారాలకు వ్యతిరేకంగా ప్రజలంతా కలిసి నిరసన తెలియజేయాలని, ఇందుకోసం జరిగే ఆందోళనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. బాపట్ల మండలం బేతపూడి గ్రామంలో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. విజయవాడలోని వాంబే కాలనీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్(కండ్రిక కాలనీ), అజిత్ సింగ్ నగర్ వడ్డెర కాలనీ తదితర ప్రాంతాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు పర్యటించారు.

విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, నెల్లూరు, కడప, కర్నూలు, అల్లూరి, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో సచివాలయాల వద్ద ధర్నాలు చేశారు. పలుచోట్ల సంతకాలు సేకరించి వాటిని సచివాలయాల కార్యదర్శులకు అందజేశారు. కాకినాడ జిల్లా కేంద్రంలోని జగన్నాథపురంలో సిపిఎం నాయకులు కరపత్రాలు పంచారు. ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తూ వీధి కూడళ్లలో సమావేశాలు నిర్వహించారు. పెద్దాపురం సినిమా సెంటర్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరు సచివాలయం వద్ద ధర్నా చేశారు. జిల్లాలోని పలు చోట్ల నిరసనలు తెలిపి వినతి పత్రాలు అందజేశారు.పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో సిపిఎం నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఆయా గ్రామ సచివాలయాల వద్ద ధర్నా చేపట్టి అధికారులకు వినతులు అందించారు.

హైకోర్టు ఉత్తర్వులపై స్టేకు నిరాకరణ

- ఆర్-5 జోన్‌పై 'సుప్రీం' విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్-5 జోన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం చేపట్టొద్దంటూ ఎపి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఉత్తర్వులను ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. తాజాగా పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ధర్మాసనం స్పందిస్తూ.. ఆర్-5 జోన్ వ్యవహారానికి, రాజధాని అంశానికి సంబంధం ఉందా? అని ప్రశ్నించింది. దీనిపై ఎపి ప్రభుత్వం తరపున న్యాయవాది అభిషేక్ సంఘ్వీ వాదనలు వినిపించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం కోసమే ప్రభుత్వం ప్రాజెక్టు చేపట్టింది. పట్టాలు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సంకల్పించింది. దీనిపై హైకోర్టు స్టే ఇచ్చింది' అని కోర్టుకు వివరించారు.

ధర్మాసనం స్పందిస్తూ.. 'జస్టిస్ జోసెఫ్ ఉత్తర్వుల తర్వాతే హైకోర్టు విచారణ జరిపింది. విచారించాల్సిన అంశాలు చాలా ఉన్నందున తదుపరి విచారణ చేపడతాం' అని జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. ఈ మేరకు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం.. మూడు వారాల్లో సమాధానం చెప్పాలని ఆదేశించింది. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేసిన తరువాత మరో మూడు వారాల్లో రిజాయిండర్ పిటిషన్ దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరులో చేపడతామని ధర్మాసనం వెల్లడించింది.

సునీల్ యాదవ్‌కు బెయిల్ ఇవ్వొద్దు

- హైకోర్టులో సిబిఐ కౌంటర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్‌కు బెయిల్ ఇవ్వొద్దని హైకోర్టును సిబిఐ కోరింది. గతంలో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌కు సంబంధించి సిబిఐ శుక్రవారం కౌంటర్ దాఖలు చేసింది. సిజె నేతృత్వంలోని బెంచ్ దీనిపై విచారణ చేపట్టింది. తనకు ఈ కేసుతో సంబంధం లేదని, ఉద్దేశపూర్వకంగా ఇరికించారన్న సునీల్ యాదవ్ వాదనలు అవాస్తవమని, హత్యలో ఆయన ప్రమేయానికి సంబంధించిన సాక్ష్యాలను కోర్టుకు సమర్పించామని సిబిఐ కౌంటర్‌లో పేర్కొంది. వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ పిటిషన్‌పై సునీల్ తరుపు అడ్వకేట్ అభ్యంతరం తెలిపారు. 8న సిబిఐ వాదనలకు అనుమతిస్తూ తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తుల అమ్మకాల్లో మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖ)



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తుల అమ్మకాలలో ఆగస్టులో మెరుగైన ఫలితాలు సాధించిందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 932వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ సింటర్‌ప్లాంట్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ సభ్యులు, ఉక్కు గుర్తింపు యూనియన్ నాయకులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆగస్టులో 4.85 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తుల అమ్మకాలు జరిగాయని, దాని విలువ రూ.2,617 కోట్లు కాగా, రూ.2800 కోట్లు అడ్వాన్సు రూపంలో నగదు వసూలైందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మొక్కవోని దీక్షతో కృషిచేస్తున్న కార్మిక వర్గానికి అభినందనలు తెలిపారు. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ కింద టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ సంస్థ రూ.820 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఎల్‌సి, ఎల్‌సి ఓపెనింగ్ తదితర ఉత్తర ప్రత్యుత్తరాలు పూర్తిచేసుకున్న తర్వాత వారితో ఒప్పందం జరుగుతుందన్నారు. వారికి బ్లూమ్స్ సప్లై చేయడం ద్వారా కానీ, స్వల్ప కాలంలో తిరిగి డబ్బులు చెల్లించేందుకు కానీ ఒప్పందాలు జరుగుతాయని తెలిపారు. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ద్వారా వచ్చే సొమ్ముతో మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ఉత్పత్తిని పున:ప్రారంభించడం ద్వారా ఉత్పత్తిలో ముందుకు సాగడానికి ఉపయోగపడుతుందన్నారు.

'హోదా'పై జగన్ మోసం

- టిడిపి నేత యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తామని ప్రతిపక్ష నేతగా నమ్మబలికిన జగన్ అధికారంలోకి రాగానే ప్రజలను దారుణంగా వంచించారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. హోదా విషయంలో గత ప్రభుత్వంపై నెపం వేస్తూ సజ్జల ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు నెరవేర్చాలని చంద్రబాబు కేంద్రాన్ని పలుమార్లు డిమాండ్ చేసినట్లు తెలిపారు. 11 రాష్ట్రాలకు హోదా పొడిగించడంతో రాష్ట్రానికి కూడా హోదా ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేశారని వివరించారు. కేసుల మాఫీ కోసం హోదా, విభజన హామీలు, రాష్ట్ర ప్రయోజనాలను జగన్ తాకట్టుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

2019 ఎన్నికల మాదిరే వచ్చే ఎన్నికల్లోనూ దొంగ ఓట్లతో గెలవాలన్నదే జగన్ దురాలోచన అని టిడిపి నేత తెనాలి శ్రావణ్ కుమార్ విలేకరుల సమావేశంలో విమర్శించారు. ప్రజాబలం లేదని తెలిసే అధికారుల సాయంతో మంత్రులు, ప్రభుత్వ పెద్దలు దొంగ ఓట్లు సృష్టించి టిడిపి ఓట్ల తొలగింపుపై దృష్టిపెట్టారని ఆరోపించారు. నరసాపురం నియోజకవర్గంలో పదివేల టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు బిఎల్‌ఒలపై ఒత్తిడి చేస్తున్నారని టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాశారు. దారి మళ్లించిన నిధుల గురించి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున ఎందుకు మాట్లాడటం లేదని టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు ప్రకటనలో ప్రశ్నించారు. ఇసుక తవ్వకాలు, ఆదాయం, జెపి సంస్థ జిఎస్‌టి రిటర్నులు సహా మొత్తం వ్యవహారంపై సిబిఐ విచారణ జరిపించాలని టిడిపి నేత కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

సిఎంకు విఆర్ఎలు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విఆర్ఎలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విఆర్ఎల సంఘం ప్రతినిధులు సిఎంను శుక్రవారం కలిశారు. విఆర్ఎలకు డిఎ రూ.500 మంజూరు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 23 వేల మందికి లబ్ధి జరిగిందని సంఘం ప్రతినిధులు తెలిపారు. గత ప్రభుత్వం డిఎ రద్దు చేసిందని, దీంతో తాము పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వం స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సిఎంను కలిసిన వారిలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులు జిటి రామాంజనేయులు, బి వెంకట్రావు, పి రాంబాబు, కోశాధికారి చెన్నుపల్లి సత్యనారాయణ ఉన్నారు.

తిరుపతిలో మరో చిరుత సంచారం

ప్రజాశక్తి - తిరుమల

అలిపిరి కాలినడక మార్గంలో మరో చిరుత సంచారం మరోసారి ఉలిక్కిపడేలా చేసింది. కాలిబాటలో లక్ష్మీనరసింహ ఆలయం వద్ద చిరుత తిరుగుతున్న దృశ్యాలు శుక్రవారం ట్రాప్ కెమెరాల్లో నమోదయ్యాయి. ఇటీవల చిరుత దాడికి గురై మరణించిన చిన్నారి లక్షిత (6) మతదేహం లభ్యమైన ప్రాంతంలోనే చిరుత సంచరించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే నాలుగు చిరుతలను అటవీ శాఖ పట్టుకుంది. తాజాగా ఆయిదో చిరుతను బంధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ ప్రాంతాలలో బోనులు ఏర్పాట్లు చేశారు. కాలినడకన శ్రీవారిని దర్శించుకునే వారు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

3 నెలల పాటు 'రైల్వే' అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు విజయవాడ రైల్వే డివిజన్‌లో మూడు నెలలపాటు ప్రివెంటివ్ విజిలెన్స్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు విజయవాడ డిఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ పేర్కొన్నారు. విజయవాడ రైల్వే డిఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం పబ్లిక్ ఇంటరెస్ట్ డిస్‌క్లోజర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇన్‌ఫార్మర్స్ (పిఐడిపిఐ) పోస్టరును ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిఐడిపిఐ అవగాహనతో ఫిర్యాదుదారుని పేరును గోప్యంగా ఉంచడం ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిపిఒ ఎం బాలమురళీధర్, విజయవాడ డివిజన్ పిఆర్ఒ నుస్రత్ ఎం మండ్రుప్కర్ పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న లోకేష్

అధికారంలోకి రాగానే బిసి రక్షణ చట్టం

- యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ

ప్రజాశక్తి-నల్లజర్ల (తూర్పుగోదావరి)

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బిసి రక్షణ చట్టం తెస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. శుక్రవారం ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం ఆరిపాటి దిబ్బలు వద్ద ఏర్పాటు చేసిన శిబిరం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. యాత్రలో భాగంగా పలువురు మహిళలు, రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఈ సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. నల్లజర్లలో కల్లుగీత కార్మికులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత సాయం, బీమా అందడం లేదని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలపై అనేక కేసులు పెట్టి వేధిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ..చంద్రబాబు ఒక విజనరీ అని, బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తు చేశారు. చంద్రన్న బీమా పథకానికి వైఎస్ఆర్ బీమా అని పెట్టారని, ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని తెలిపారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అని ఇప్పుడు జే బ్రాండు మద్యం అమ్ముకుంటున్నాడని విమర్శించారు.

కవులూరులో చేనేత కార్మికులతో లోకేష్ ముచ్చటించారు. చీపురుగూడెంలో జాతీయ రహదారిపై పడిన గోతుల్లో వరి నాట్లు వేశారు. తమ సమస్యలపై కాంట్రాక్టు ఉపాధ్యాయులు లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ యాత్రలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు, జడ్‌పి మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడాపెడా విద్యుత్ కోతలు

- పల్లెల్లో ఎప్పుడువస్తోందో చెప్పలేని స్థితి
- పట్టణాల్లో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ కట్
- పంటలను కాపాడుకునేందుకు రోడెక్కిన రైతులు



అద్దంకి-సంతమాగులూరు రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. లోడ్ రిలీఫ్ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో కోతలు విధిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయానికి సైతం రెండు గంటలే విద్యుత్ సరఫరా చేస్తుండడంతో సబ్‌స్టేషన్ల ఎదుట అన్నదాతలు ఆందోళనలకు దిగుతున్నారు. వేళపాళాలేని కరెంటుతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పట్టణాల్లో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ కరెంటు కోత విధిస్తున్నారు. దీంతో నగర వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఒకవైపు ఎండ వేడి..మరో వైపు అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రాంతంలో దండుబాటకు సమీపంలో ఉన్న సుమారు పది వార్డుల్లో ప్రతిరోజూ అర్ధరాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు కరెంటు కోతలు విధిస్తున్నారు. కొత్తపేట, లక్ష్మీ శ్రీనివాస కాలనీ, జాండ్రపేట, తదితర ప్రాంతాల్లోనూ గంటల తరబడి కరెంటు కోతలు ఉన్నాయి. ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట గత వారం రోజులుగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం, రాత్రిపూట రెండు, మూడు గంటలు కోత విధిస్తున్నారు. పట్టణాల్లో సైతం రాత్రిపూట విద్యుత్ కోతపెడుతున్నారు. నెట్, జిరాక్స్ షాపులు, చిన్నచిన్న టిఫెన్ సెంటర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. రెండు రోజులుగా శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోనూ అప్రకటిత కోతలు మొదలయ్యాయి.

వ్యవసాయానికి రెండు గంటలే

విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా బాపట్ల జిల్లా బల్లికురవ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అద్దంకి-సంతమాగులూరు రోడ్డుపై రైతులు బైఠాయించి.. నిరసన తెలిపారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. రోజుకు తొమ్మిది గంటల వ్యవసాయానికి విద్యుత్ ఇస్తామని చెప్పి కనీసం రెండు గంటలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి మిరప, పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేశామని, వర్షాలు లేకపోవడంతో పూర్తిగా బోర్లు పైనే ఆధార పడాల్సి వచ్చిందన్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక 24 గంటలు పొలం వద్ద కాపలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యుత్ కోతలతో పంటలు పూర్తిగా ఎండు ముఖం పట్టాయని వాపోయారు. విద్యుత్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద తురకపాలెం రైతులు పురుగు మందు డబ్బాలతో ధర్నాకు దిగారు. వారం రోజులుగా వ్యవసాయానికి రోజుకు గంట కూడా సరఫరా చేయడం లేదని, అది కూడా విడతలు విడతలుగా ఇస్తున్నారని తెలిపారు. ఆందోళన వద్దకు వచ్చిన విద్యుత్ ఎఇ మాట్లాడుతూ.. అన్ని గ్రామాలకూ విద్యుత్‌ను అందించలేకపోతున్నామని, పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

ప్రాజెక్టుల నిర్మాణాల కోసం ఐక్యపోరాటం

- సదస్సులో పలువురు వక్తలు
- సిపిఐ బస్సుయాత్రకు సిపిఎం, కాంగ్రెస్ సంఘీభావం

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్

రాయలసీమ వెనకబాటు తనం పోవాలన్నా.. రాష్ట్రం సస్యశ్యామలం కావాలన్నా ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టాలని, అప్పుడే తాగు, సాగు నీటితోపాటు పరిశ్రమలు వస్తాయని, రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు తెలిపారు. ప్రాజెక్టుల సాధనకోసం ఐక్యపోరాటాలు అవసరమని అన్నారు. రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి నినాదంతో సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం నంద్యాలకు చేరింది. ఈ సందర్భంగా నంద్యాల మున్సిపల్ టౌన్‌హాలులో సాగు నీటి ప్రాజెక్టులపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జాప్యం చేస్తోందని తెలిపారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నదుల్లోని ఇసుక దోపిడీ చేస్తూ కేవలం సిల్ట్ తీస్తున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాయలసీమ వెనుకబాటును పట్టించుకోకుండా రాయల సీమ ద్రోహిగా జగన్ మారారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ వెనుకబాటుకు ప్రాజెక్టులపైన పాలకులకు శ్రద్ధ లేకపోవడమే కారణమని తెలిపారు. రాలయసీమ సాగునీటి ప్రాజెక్టుల సాధన సమితి నాయకులు బొజ్జ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టులపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు పాల్గొన్నారు.

ఇద్దరు మావోయిస్టు దళ సభ్యులు లొంగుబాటు

ప్రజాశక్తి -పాడేరు (అల్లూరి జిల్లా)

ఇద్దరు మావోయిస్టు దళ సభ్యులు శుక్రవారం అల్లూరి జిల్లా ఎస్‌పి ఎదుట లొంగిపోయారు. వీరు చత్తీస్‌గఢ్ రాష్ట్రం గుత్తికోయ తెగకు చెందిన సాతగావ్ ఏరియా కమిటీ సభ్యులు సున్నం నీలా (అలియాస్ సోనీ), దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ రెండవ కంపెనీ మూడవ ప్లాటున్ సభ్యుడు మడివి బుధుగా గుర్తించారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాల పట్ల విరక్తి చెంది జనజీవన స్రవంతిలో కలిసేందుకు వీరు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు ఎస్‌పి తుహిన్ సిన్హా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం అడిషనల్ ఆపరేషన్స్ ఎస్‌పి కెవి.మహేశ్వర్‌రెడ్డి, సిఆర్‌పిఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ కుమార్, ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సూర్యకాంతం పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు

సూర్యకాంతం భౌతికకాయం కిమ్స్‌కు అప్పగింత

ప్రజాశక్తి-అమలాపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి మాతృమూర్తి గోసంగి సూర్యకాంతం భౌతికకాయాన్ని శుక్రవారం ఉదయం అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కిమ్స్ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించారు. గురువారం ఉదయం కాకినాడలో బేబిరాణి ఇంటి వద్ద సూర్యకాంతం మరణించిన వెంటనే కాకినాడ ఐ ఫౌండేషన్‌కు నేత్రాలను దానం చేశారు. అనంతరం ఆమె స్వగ్రామమైన అమలాపురం మండలం సాకుర్రు గున్నేపల్లికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కిమ్స్ మెడికల్ కళాశాలకు భౌతికకాయాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి అప్పగించారు. వైద్య విద్యార్థుల అనాటమీ విద్యకు ఉపయోగపడే విధంగా సూర్యకాంతం మృతదేహాన్ని కిమ్స్ వైద్యశాలకు అప్పగించడం అభినందనీయమని ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ వీర్రాజు, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ నారాయణ అన్నారు. సూర్యకాంతం మృతదేహం వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం నాయకులు, కుటుంబ సభ్యులు శ్రద్ధాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బేబిరాణి, ఆమె భర్త సూర్యనారాయణ, వారి కుమార్తెలు స్పందన, స్ఫూర్తి, సోదరులు, సోదరీమణులు సూర్యకాంతాన్ని ఆదరించిన తీరు ఆదర్శంగా ఉందని అన్నారు.

ఎసిబి వలలో సబ్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి-కోవూరు (నెల్లూరు జిల్లా)

నెల్లూరు జిల్లా కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఎసిబి అధికారులు శుక్రవారం దాడి చేశారు. సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌తో పాటు ఇద్దరు మధ్యవర్తులను అదుపులోకి తీసుకున్నారు. ఎసిబి డిఎస్‌పి మోహన్‌రావు తన సిబ్బందితో కలిసి కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రెక్కీ నిర్వహించి మధ్యవర్తులైన వల్లెపు రాము, తిరువీధి రత్నంకు నగదు అందిస్తుండగా అధికారులు దాడి చేశారు. మధ్యవర్తులతోపాటు సబ్ రిజిస్ట్రార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎసిబి సిఐ జివిఎల్ శ్రీనివాసరావు, కిరణ్, ఆంజనేయ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వేదాంత రహస్య లాబీయింగ్

- పర్యావరణ నిబంధనలకు తూట్లు
- కేంద్ర మాజీ మంత్రి జవదేకర్ ప్రమేయం
- దొడ్డిదారిన అనుకూల మార్పులు
- ఒసిసిఆర్‌పి రిపోర్ట్

న్యూఢిల్లీ : కార్పొరేట్ల మోసాలు, అక్రమాలకు మోడీ సర్కార్ దన్నుగా నిలుస్తోందని.. వారి లాబీయింగ్‌కు తలొగ్గుతోందని ఒసిసిఆర్‌పి రిపోర్టు స్పష్టం చేసింది. అదానీ అక్రమాలు, ఆర్థిక మోసాలను బయటపెట్టిన లాభాపేక్షలేని సంస్థ ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ (ఒసిసిఆర్‌పి) తాజాగా మైనింగ్ వ్యాపార దిగ్గజం అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత గ్రూపు ప్రభుత్వంతో చేసిన తెరచాటు లాబీయింగ్‌ను బయటపెట్టింది. కరోనా సమయంలో కీలక పర్యావరణ నిబంధనలను బలహీనపర్చేందుకు రహస్య లాబీయింగ్ చేసిందని ఒసిసిఆర్‌పి తన రిపోర్టులో వెల్లడించింది. సొంత షేర్లలో అదానీ కుటుంబం అజ్ఞాత పెట్టుబడులతో భారీగా అక్రమాలకు పాల్పడి పెద్ద మొత్తంలో లబ్ధి పొందినట్లు ఆరోపించిన ఒసిసిఆర్‌పి.. మరుసటి రోజే వేదాంత గ్రూపు మోసాలను బయటపెట్టింది. జనవరి 2021లో వేదాంత గ్రూప్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణశాఖ మంత్రి ప్రకాష్ జవదేవకర్‌తో మోసపూరిత సంప్రదింపులు చేసిందని తెలిపింది. కొత్త పర్యావరణ అనుమతులు పొందకుండానే మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకోవడానికి ప్రభుత్వంతో లాబీయింగ్ చేశారని తేలింది. ఒసిసిఆర్‌పి రిపోర్టు ప్రకారం.. 'పర్యావరణ నిబంధనలకు వేదాంత రహస్యంగా తూట్లు పొడిచేందుకు ప్రయత్నించింది. కొత్తగా ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండా మైనింగ్ కంపెనీలు తమ ఉత్పత్తిని 50 శాతం పెంచుకునేలా వేదాంత చేసిన రహస్య లాబీయింగ్ చేసింది. ఇందుకోసం 2021లో వేదాంత రిసోర్సెస్ లిమిటెడ్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు. పర్యావరణ అనుమతులను ఎత్తివేయడం ద్వారా ఉత్పత్తి, ఆర్థిక వృద్ధిని తక్షణం పెంచడమే కాకుండా, ఇది ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని, ఉద్యోగాలను సృష్టిస్తుందని పేర్కొన్నారు. తదుపరి పర్యావరణ క్లియరెన్స్ కోసం దరఖాస్తు చేయకుండా కంపెనీలను 50 శాతం ఎక్కువ ఉత్పత్తి చేయడానికి అనుమతించడానికి సాధారణ నోటిఫికేషన్ జారీ చేయాలని అగర్వాల్ తన లేఖలో సూచించారు. వేదాంత ప్రతిపాదించిన రహస్య మార్పులను భారత ప్రభుత్వం ఆమోదించింది. దొడ్డిదారి పద్ధతుల ద్వారా వాటిని అమలు కూడా చేసింది' అని ఒసిసిఆర్‌పి వెల్లడించింది.

పిఎంఒ నుంచి ఒత్తిడి..!

'అగర్వాల్ లేఖపై వివిఐపి లేదా చాలా ముఖ్యమైందని గుర్తు పెట్టిన మంత్రి జవదేవకర్.. అతని మంత్రిత్వ శాఖ కార్యదర్శి, అటవీశాఖ డైరెక్టర్ జనరల్‌తో విధాన సమస్యను చర్చించాలని చెప్పారు. జవదేకర్‌కు అగర్వాల్ లేఖ రాసిన తర్వాత.. వేదాంత చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) సునీల్ దుగ్గల్ నేరుగా ప్రధాని నరేంద్ర మోడీకి ఇదే విషయమై లేఖ రాశారు. ప్రస్తుతం ఉన్న పర్యావరణ క్లియరెన్స్ మోడల్‌ను తొలగించడం ద్వారా వెంటనే ఆర్థిక వృద్ధిని పెంచవచ్చని అందులో పేర్కొన్నారు. మోడీ కార్యాలయం ఈ లేఖను పర్యావరణశాఖ కార్యదర్శికి పంపింది. పర్యావరణ అనుమతుల నిబంధనల్లో మార్పులకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి అంతర్గత వ్యతిరేకత వచ్చింది. కాగా.. అనీల్ అగర్వాల్ లాబీయింగ్‌తో ప్రభుత్వ వర్గాలు, మైనింగ్ కార్యదర్శి కూడా నిబంధనలను సడలించాలని ఒత్తిడి చేశారు.

అగర్వాల్‌కు అనుకూలంగా దొడ్డిదారిన నిబంధనలు సడలించారు. ఎటువంటి బహిరంగ చర్చ లేకుండా.. అతి సులభంగా ముఖ్యమైన నిబంధనలను సవరించడం ద్వారా ప్రభుత్వం కూడా చట్టాన్ని ఉల్లంఘించి ఉండవచ్చు' అని ఒసిసిఆర్‌పి రిపోర్టు వెల్లడించింది.

ఎరువుల అక్రమ తయారీ కేంద్రంపై విజిలెన్స్ అధికారుల దాడులు

- రూ.4.7 కోట్ల ఎరువులు సీజ్

ప్రజాశక్తి-పంగులూరు (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని ముప్పవరం కేంద్రంగా అక్రమంగా ఎరువులు, పురుగు మందులు తయారుచేస్తున్న విజయదుర్గ ఫాస్ఫేట్ అండ్ ఫెర్టిలైజర్స్ ప్రయివేట్ లిమిటెడ్‌పై శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. రీజినల్ విజిలెన్స్ ఎస్‌పి ఈశ్వరరావు, విజిలెన్స్ ఎఒ వాసంతి, సిఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ఈశ్వరరావు మాట్లాడుతూ.. ఇంకొల్లు గ్రామానికి చెందిన వేటూరి వెంకటేశ్వర్లు 2016లో విజయదుర్గ ఫాస్ఫేట్ అండ్ ఫెర్టిలైజర్స్ ప్రయివేట్ లిమిటెడ్ అనే కంపెనీని ప్రారంభించారని, విదేశాల నుంచి ఎరువులను దిగుమతి చేసుకునే అనుమతి ఈ కంపెనీకి ఉందని తెలిపారు. విదేశాల నుంచి వచ్చిన సరుకుకు నాణ్యత తగ్గించేలా రకరకాల ముడి పదార్థాలు, కలర్స్ వినియోగించి రైతులకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించమన్నారు. గోదాములో ప్రస్తుతం 2.11 మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.4.7 కోట్లు ఉంటుందని, వీటిని సీజ్ చేశామని తెలిపారు. సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నామని చెప్పారు. కొంతమంది వర్కర్లను యజమాని నియమించుకొని ఎరువులు, పురుగు మందులను అక్రమంగా తయారుచేసి తన సొంత బ్రాండ్‌తో మార్కెట్ చేస్తున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

సంపాదకీయం


కరువు ముంగిట..

కరువు కోరలు చాస్తోంది. దేశ రైతాంగం కోటి ఆశలతో ఎదురుచూసే రుతుపవన వర్షాలు ఈ దఫా ముఖం చాటేశాయి. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో దాదాపు ఆగస్టు మాసమంతా వానల్లేవ్. అడపాదడపా పడినా.. చేను పదునెక్కి విత్తనం వేసే స్థాయిలో కురవకపోవడంతో అన్నదాత కుదేలయ్యాడు. అదునులో విత్తు పడక, వేసిన పైర్లకు సకాలంలో తడులందని పరిస్థితుల్లో ఖరీఫ్ దిగుబడులు బాగా తగ్గిపోవచ్చున్న వాతావరణ, వ్యవసాయ రంగ నిపుణుల హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ధరాఘాతంతో సాగు పెట్టుబడులు పెరిగిపోయి ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉన్న రైతాంగాన్ని వర్షాభావ పరిస్థితులు మరింత గడ్డుస్థితిలోకి నెట్టేస్తున్నాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, గుజరాత్ వంటి ప్రధాన వ్యవసాయక రాష్ట్రాల్లో ఆగస్టులో దీర్ఘకాల సగటుతో పోల్చితే నైరుతి రుతుపవనాల వర్షపాతం లోటు 30 నుంచి 80 శాతంగా నమోదైంది. సెప్టెంబరులోనూ ఇదే పరిస్థితి కొనసాగితే కరువు కరాళనృత్యం చేసే ప్రమాదముంది. ఎల్‌నినో సంవత్సరాల్లో 70 శాతం దాకా సెప్టెంబరులోనూ కనీసంలో కనీసం 10 శాతం వర్షపాతం లోటే తాండవించింది. అందువల్ల ఆగస్టులో ఏర్పడిన వర్షపాత లోటు పూడ్చే పరిస్థితి రాకపోవచ్చు. రాబోయే 45 రోజుల్లో పరిస్థితి ఇలాగే కొనసాగితే చేను, చెలకల్లో మిగిలేది కర్షకుల కన్నీటి ధారలే. దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 40 శాతం రుతుపవనాల వర్షాల మీదే ఆధారపడి ఉంది. ప్రధానంగా వరి, వేరుశనగ, సోయాబీన్, సజ్జలు వంటి తృణధాన్యాలకు తక్షణమే తడులందాల్సిన పరిస్థితి నెలకొంది. రుతుపవనాల లోటుతో పాటు జలాశయాల్లోనూ నీటి మట్టాలు తగ్గిపోవడంతో ఆహార కొరతకు దారితీసే ప్రమాదాన్ని తోసిపుచ్చలేము.

తెలుగు రాష్ట్రాల్లోనూ పరిస్థితి దయనీయంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు ముగిసినా కూడా లక్షలాది ఎకరాలు విత్తనం పడక బీడుపడటం ఆందోళనకరం. ఇప్పటికి కావాల్సిన సాధారణ సాగులో 20 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాలేదని ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షాల్లేక భూములు నెర్రెలిచ్చాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. మూడొంతుల రాష్ట్రం తీవ్ర వర్షాభావం కోరల్లో చిక్కుకుంది. సగానికిపైగా మండలాలు డ్రైస్పెల్ (వర్షానికి వర్షానికి మధ్య అంతరం)లో మగ్గుతున్నాయి. సుదీర్ఘకాలం వానలు పడకపోవడంతో వేసిన పైర్లు బెట్టకొచ్చి తెగుళ్లు వ్యాపిస్తుండటంతో రైతుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. కరువుకు కేరాఫ్‌గా ఉన్న రాయలసీమ ప్రాంతాల్లో వేసిన పైర్లు తొలగిస్తుండగా.. కాలువల ద్వారా సాగునీటి అవకాశాలున్న గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, ప్రకాశం, నంద్యాల వంటి చోట్ల జలాశయాలు అడుగంటిన నేపథ్యంలో పైర్లను రక్షించుకునేందుకు రైతులు నానా తిప్పలు పడుతున్నారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఈ ఏడాది వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకుంది. ప్రధానంగా నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో సేద్యానికి నీరు ఇవ్వలేమని ప్రకటించడం బాధాకరం.

సీజన్‌లో మూడు నెలలు గడిచిపోగా ఇక సెప్టెంబర్ ఒక్క నెలే మిగిలిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలే రైతులకు ఆశకిరణాలు. అరకొర అదునులో ఉన్నదంతా ఊడ్చి దుక్కిపాల్జేసిన రైతన్న ఇప్పుడు ఒకవేళ వర్షాలు పడి ప్రత్యామ్నాయ పంటలు వేసుకుందామన్నా చేతిలో చిల్లిగవ్వ లేదు. దేశానికి, రాష్ట్రానికి కరువు, కాటకాలు కొత్తకాదు. కానీ దుర్భిక్ష పరిస్థితుల్లో కష్టజీవులను ఆదుకునేందుకు అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కానీ దృష్టి సారించడం లేదు. పంట నష్ట పరిహారమిచ్చే బాధ్యతను పాలకులు విస్మరిస్తున్నారు. కార్పొరేట్ బీమా కంపెనీలకు కోట్ల రూపాయలు ప్రీమియం చెల్లిస్తున్నా ఇ-క్రాప్ వంటి సాంకేతిక అవరోధాలతో రైతుకు పరిహారం ఎగవేస్తున్నారు. వ్యవసాయ పనుల్లేని సమయంలో ఆసరాగా నిలుస్తున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చడంతో పేద కార్మికులకు వలసలే శరణ్యమవుతున్నాయి. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోండంటూ రైతులకు ఉచిత సలహాలు ఇవ్వడంతోనే పాలకులు చేతులు దులిపేసుకోకుండా కరువు ప్రభావితానికి గురయ్యే కష్టజీవులందరినీ ఆదుకోవాలి. గంపెడు ఆశలతో విత్తులు, పైర్లు వేసి నష్టాలపాలైన అన్నదాతలకు ఆర్థిక చేయూతనందించి అండగా నిలువాలి. ప్రత్యామ్నాయ పంటల సాగుకయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించాలి. ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కార్మికులకు ప్రత్యేక భత్యం చెల్లించాలి.

మహనీయుల మాట




వ్యక్తుల చైతన్యాన్ని నీరుగార్చడం పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే అనర్థాలన్నిటిలోకీ పెద్ద అనర్థం. మన విద్యా వ్యవస్థ మొత్తం దీనివల్ల నాశనం అవుతోంది. విద్యార్థిలో అతిశయంతో కూడిన పోటీ ప్రవేశ పెడుతున్నారు. ఎలాగైనా విజయం సాధిస్తే తన భవిష్యత్తు బాగుపడుతుందనే ఉద్దేశంతో విద్యార్థి విజయం కోసం పరితపించి పోతున్నాడు.


\- ఐన్‌స్టీన్,
ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.

అసమానతల భారత్ కోసమే మితవాదుల పట్టు

విశ్లేషణ



రామ్ పునియానీ



> ఇప్పుడు మనం తిరోగమన మార్గంలో ఉన్నట్లు కనపడుతున్నది. దేవాలయాలు, పవిత్ర గోవు వంటి అంశాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ప్రాచీన విలువలను (బ్రాహ్మణవాద వివరణలను నాగరిక విలువలుగా) ఉపయోగించడం ద్వారా... ప్రపంచంలోకెల్లా మహత్తరమైన ప్రజా ఉద్యమం (భారత స్వాతంత్ర్య పోరాటం)తో సాధించిన విజయాలను... బలహీనపరచి అసమానతల వైపు నడిపిస్తున్నారు.

డా.వివేక్ దేవరాయ్, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలికి ప్రధానమైన వ్యక్తి. మరో విధంగా చెప్పాలంటే ఆయన అధికార కేంద్రాలకు చాలా దగ్గరగా ఉండే వ్యక్తి. ఆగస్ట్ 15న 'లైవ్ మింట్' పత్రికకు రాసిన వ్యాసంలో ఆయన, ప్రస్తుత రాజ్యాంగం కొనసాగింపును ప్రశ్నించాడు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆమోదించబడిన రాజ్యాంగాన్ని అనేక పర్యాయాలు సవరించారు కాబట్టి ప్రస్తుతం కొనసాగుతున్న రాజ్యాంగం, అప్పటి రాజ్యాంగం ఒకటి కాదనేది ఆయన ఉద్దేశ్యం. కార్యనిర్వాహక వర్గం (ఎగ్జిక్యూటివ్) రాజ్యాంగం మౌలిక నిర్మాణాన్ని మార్చకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది కాబట్టి, ఈ రాజ్యాంగం కాలం కూడా మించిపోయింది కాబట్టి మనం ఒక కొత్త రాజ్యాంగాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. మరీ ముఖ్యంగా, ఈ రాజ్యాంగం వలసవాద వారసత్వాన్ని కలిగి ఉందనీ, ఈ రాజ్యాంగంలోని అనేక నిబంధనల్ని, ముఖ్యంగా సామ్యవాదం, లౌకికవాదం, న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ విలువల్ని ఆయన ప్రశ్నిస్తారు. అయితే ఆర్థిక సలహా మండలి, దేవరాయ్ వ్యక్తం చేసిన అభిప్రాయాలతో అధికారికంగా విభేదించింది.

ఈ రాజ్యాంగం వలస వారసత్వం కలిగి ఉందని, దీన్ని బ్రిటీష్ వారు తీసుకొచ్చిన '1935 భారత ప్రభుత్వ చట్టం' ఆధారంగా ఏర్పాటు చేశారని, ఇది భారతీయ విలువలను ప్రతిబింబించడం లేదని, ఇప్పటికీ హిందూ మితవాద నాయకులు, సిద్ధాంతకర్తలు చెప్తుంటారు. ఈ రాజ్యాంగంతో మితవాద హిందూ జాతీయవాదులు ఏ మాత్రం సౌకర్యవంతంగా లేరు. అయితే ఇది వారనుకున్నట్లుగా '1935 భారత ప్రభుత్వ చట్టం' యొక్క కొనసాగింపు కాదు. మూడు సంవత్సరాల పాటు ఎంతో జాగ్రత్తగా, సమగ్రంగా, లోతైన అవగాహనతో, సంపూర్ణంగా చర్చించి తయారు చేసిన తరువాతనే భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడు బి.ఆర్.అంబేద్కర్ దీనిని ముందుకు తీసుకొని వచ్చారు. రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఇంకా అనేకమంది సభ్యులు, భారత ప్రజలు పాల్గొన్న వలసవాద వ్యతిరేక పోరాటంలో గుర్తింపు పొందినవారే. 'భారతదేశం ఒక దేశం'గా రూపొందడంలో ఈ వలసవాద వ్యతిరేక పోరాటం అత్యంత కీలకమైనది. బహుళత్వం, సమ్మిళిత భారత జాతీయవాదం కోసం నిలబడిన వారికి పూర్తి భిన్నంగా...మతతత్వ జాతీయవాదులు ఈ మహత్తర పోరాటానికి దూరంగా ఉన్నారు. అంతేకాకుండా, ఈ ప్రజా ఉద్యమం నుంచి ఉద్భవించిన విలువలను కూడా వ్యతిరేకించారు.

రాజ్యాంగం అమలులోకి వచ్చినపుడు, ఆర్ఎస్ఎస్ ప్రచార పత్రిక 'ఆర్గనైజర్' రాజ్యాంగాన్ని తిరస్కరించి, మనుస్మృతిని రాజ్యాంగంగా అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేసింది. 1949 నవంబర్ 30వ తేదీ ఆర్గనైజర్ పత్రిక సంపాదకీయం ఇలా ఉంది: "మన రాజ్యాంగంలో ప్రాచీన భారతదేశంలోని ప్రత్యేక రాజ్యాంగాభివృద్ధి గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. పర్షియాకు చెందిన సోలోన్ లేదా స్పరాటాకు చెందిన లైకర్గస్ కంటే చాలా ముందుగానే మనువు చట్టాలను రచించారు. నేటికి కూడా మనుస్మృతిలో రచించబడిన చట్టాలు, ప్రపంచంలో ప్రశంసలు పొందుతూ, సహజమైన విధేయత, సమాజంలో అంగీకారమైన నిబంధనల అనుగుణ్యతలను బయటకు తీస్తున్నాయి. కానీ మన రాజ్యాంగ పండితుల దృష్టిలో ఇవేవీ లేవు".

హిందూ మితవాదుల పెరుగుదలతో రాజ్యాంగం పట్ల వ్యతిరేకత కూడా పెరగసాగింది. 1998లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఏర్పడినప్పుడు, రాజ్యాంగాన్ని సమీక్షించడానికి వెంకటాచలయ్య కమిషన్‌ను నియమించింది. కమిషన్ ఏర్పాటుపై తీవ్ర వ్యతిరేకత వెలువడింది. అయినప్పటికీ దానిని అమలు చేయడంలో బిజెపి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి నష్టం వాటిల్లింది.

ఆర్.ఎస్.ఎస్ - రాజ్యాంగం పట్ల వ్యతిరేకత

ఆర్.ఎస్.ఎస్ సర్సంగ్ చాలక్‌గా కె.సుదర్శన్ నియమించబడినపుడు...భారత రాజ్యాంగం పాశ్చాత్య విలువలపై ఆధారపడిందని, దాని స్థానంలో భారతీయ పవిత్ర గ్రంథాల (మనుస్మృతిని సూచిస్తూ)పై ఆధారపడిన రాజ్యాంగం రావాలని బహిరంగంగానే ప్రకటన చేశాడు.

"మన రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చివేయడానికి ఏ మాత్రం సిగ్గుపడాల్సిన పని లేదు. ఇప్పటికే దానిని వంద సార్లు మార్చారు" అంటాడాయన. ఫ్రాన్స్ రాజ్యాంగాన్ని నాలుగు సార్లు సవరించిందన్నాడు. దీనికి పవిత్రత అంటూ ఏమీ లేదనీ, అసలు దేశంలో అనేక రుగ్మతలకు మూల కారణం ప్రస్తుత రాజ్యాంగమేనని ఆయన అంటాడు.

బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వివిధ స్థాయి నాయకులు ఇలాంటి ప్రకటనలు అదేపనిగా చేస్తూనే వున్నారు. ఇటీవలి కాలంలో ప్రతిపక్ష పార్టీలు 'ఇండియా'గా ఏర్పడినప్పుడు, అనేకమంది మితవాదులు, 'ఇండియా' అనే పదాన్ని బ్రిటీష్ వారు సృష్టించారనే సాకుతో దానిని వ్యతిరేకించారు. ఈ 'ఇండియా' అనే పదం బానిసత్వానికి చిహ్నం కాబట్టి, రాజ్యాంగంలో ఆ పదం యొక్క స్థానం ఎక్కడ అంటాడు బిజెపి రాజ్యసభ ఎం.పి, నరేష్ బన్సాల్.

ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే ఇలా వ్యాఖ్యానించాడు. "యూరో సెంట్రిక్ భావాలు, విధానాలు, ఆచారాలు ఇంకా దశాబ్దాలుగా మనల్ని పాలిస్తూనే ఉన్నాయి. స్వతంత్ర భారత దేశం వాటిని పూర్తిగా వదిలించుకోలేదు" అన్నాడు.

రాజ్యాంగం పట్ల వ్యతిరేకత విషయంలో దేవరాయ్, ఆర్.ఎస్.ఎస్ ఆలోచనలు కలిశాయి. ఆర్ఎస్ఎస్ గణాలు రాజ్యాంగం యొక్క పాశ్చాత్య స్వభావం పైన ఎక్కువ దృష్టిని కేంద్రీకరిస్తుండగా, స్వేచ్ఛ, సమానత్వం, లౌకికవాదం లాంటి అంశాల విలువలపై ప్రశ్నిస్తూ, దేవరాయ్ అసలు విషయాన్ని బయట పెట్టాడు. వలసవాద వారసత్వ వాదన, పాశ్చాత్య ఆసియా దేశాలకు చెందిన 'ముస్లిం బ్రదర్‌హుడ్' లాంటి సంస్థలకు సమానంగా ఉంటుంది. ఇవి పాశ్చాత్యమైనవనే కారణంతో స్వేచ్ఛ, సమానత్వం వంటి విలువలను వారు వ్యతిరేకిస్తారు. దేవరాయ్ ప్రస్తుత పాలక వర్గానికి చెందిన వారు. భిన్న లింగ, మతాలు, కులాల మధ్య సమానత్వం ఉండాలనే భావనతో ఆయనకు ఏమాత్రం అంగీకారం లేదు.

రాజ్యాంగం - ప్రజాగ్రహం

వలస కాలంలో సమాజంలో కులం, లింగ వ్యవస్థలు కేంద్ర బిందువుగా ఉండడం వల్ల, ఆర్ఎస్ఎస్ గణాలు మనుస్మృతిని ఒక స్వర్ణ యుగంగా వర్ణిస్తున్నాయి. కానీ వలస కాలంలోనే లింగ, కుల వ్యవస్థలు వాటి పట్టును కోల్పోవడం మొదలైంది. ఈ కాలంలోనే కార్మికులు తమ సంఘాలను (నారాయణ్ మేఘాజీ లోఖాండే, కామ్రేడ్ సింగారవేలు) ఏర్పరచుకోగలిగారు. ఈ కాలంలోనే పాలక వర్గాలు చేస్తున్న దోపిడీ గురించి, వాటిని వదిలించుకోవాల్సిన అవసరం గురించి భగత్ సింగ్ స్పష్టంగా వివరించాడు. వీటిలో చాలా పోరాటాలకు (వలస పాలన కింద ఉంటూ, వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ) భారతీయులే నాయకత్వం వహించారు. వలస కాలాన్ని మంచి లేదా చెడు జరిగిన కాలంగా చూడలేం, కానీ ఈ కాలంలో విచారకరమైన పరిస్థితులు ఉన్నాయి. వలస అధికారం మన సంపదను దోచుకొని పోవడంతో, వారు కూడా "మనుషులంతా (మహిళలు కూడా) సమానం" అని పేర్కొనే సంస్థలను ప్రారంభించాల్సి వచ్చింది. ఆర్ఎస్ఎస్ గణాలు, ప్రధానమంత్రి సలహాదారు, రాజ్యాంగాన్ని వదిలించుకోడానికి భిన్నమైన వాదనలను వినిపించవచ్చు. సారంలో వారు, భగత్ సింగ్ ప్రతిపాదించిన విలువలకు, సమానత్వానికి, అంబేద్కర్ ప్రారంభించిన పోరాటాలకు, ముఖ్యంగా జాతీయోద్యమానికి వ్యతిరేకంగా ఉంటారు.


1990ల వరకు భారత రాజ్యాంగం ఆధారంగా, నెహ్రూ ఆధునీకరణ విధానాలతో దేశం సమానత్వ మార్గాన్ని అనుసరించే ప్రయత్నం చేసింది. ఇప్పుడు మనం తిరోగమన మార్గంలో ఉన్నట్లు కనపడుతున్నది. దేవాలయాలు, పవిత్ర గోవు వంటి అంశాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ప్రాచీన విలువలను (బ్రాహ్మణవాద వివరణలను నాగరిక విలువలుగా) ఉపయోగించడం ద్వారా...ప్రపంచంలోకెల్లా మహత్తరమైన ప్రజా ఉద్యమం (భారత స్వాతంత్ర్య పోరాటం)తో సాధించిన విజయాలను...బలహీనపరచి అసమానతల వైపు నడిపిస్తున్నారు.

భారత రాజ్యాంగానికి వ్యతిరేకత అంటే...మతం (బ్రాహ్మణవాదం) ద్వారా పవిత్రమైనదిగా పరిగణించబడిన అసమానతల (కులం, వర్గం, లింగ) యుగానికి దేశాన్ని నెట్టివేయడానికే ఈ వ్యతిరేకతను ఉపయోగించడం అవుతుంది.

(వ్యాస రచయిత మానవ హక్కుల కార్యకర్త, ఐఐటీ బాంబేలో విశ్రాంత ప్రొఫెసర్)
('ద వైర్' సౌజన్యంతో)

★

దీని భావమేమి....?



అదానీ, అంబానీ, టాటా అంటూ కొందరికే ఆస్తులు సృష్టించే కంటే ప్రతి కుటుంబానికి ఆస్తి సృష్టించే అవకాశం కల్పించాలని చంద్రబాబు చెప్పిన మాటలు వినడానికి బాగానే ఉండొచ్చు. కానీ బడా కార్పొరేట్లకు భారీ రాయితీలిచ్చి ఖజానాను డొల్ల చేస్తున్న మోడీ విధానాల గురించి మాట్లాడకపోతే ఎలా? లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ రంగ బ్యాంకుల రుణాలను మాఫీ చేయడాన్ని ప్రశ్నించాలి కదా! ప్రధాని మోడీ అనుంగు మిత్రుడైన గౌతమ్ అదానీ సాగించిన ఘరానా దోపిడీ గురించి హిండెన్‌బర్గ్ నివేదిక తేటతెల్లం చేసిన విషయాల గురించైనా చంద్రబాబు ప్రస్తావించలేదెందుకు? రాఫెల్ కుంభకోణం వంటి క్రోనీ క్యాపిటల్ మాయాజాలం మాటేమిటి? ఇవేవీ చంద్రబాబు మాట్లాడలేరు. ఎందుకంటే ఆయనవీ అవే విధానాలు కనుక!

తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా చర్చించిన సందర్భంలో తన 'మనసులోని మాటలు' మరోసారి వెల్లడించారు. ఇష్టాగోష్టి ఆసాంతం రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన, చేస్తున్న బిజెపి, కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోడీ గురించి పల్లెత్తు మాటాడలేదు సరికదా వారికి సానుకూల సంకేతాలివ్వడానికే ఆయన ప్రయాస పడడం గమనార్హం. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాను కలిసిన అనంతరం ఆయన మీడియాతో ఈ విషయాలు పంచుకున్నారు.

ముఖ్యమంత్రి హోదాలో 2018-19లలో కేంద్ర ప్రభుత్వానికి, బిజెపికి వ్యతిరేకంగా రాష్ట్రమంతటా విద్యార్థి యువజనుల్ని సమీకరించి 'ధర్మ యుద్ధం' పేరిట అనేక సభలను నిర్వహించిన ఆయన వాటిని మరిచిపోయినట్లుంది. ప్రత్యేక హోదా కోసమే ఎన్‌డిఎ నుంచి బయటకు వచ్చానని, మిగతా విషయాల్లో కేంద్రంతో ఎలాంటి విభేదాలు లేవని ఇప్పుడంటున్నారు. బిజెపికి స్నేహ హస్తం చాస్తూ....న్నారు. మరి ఇప్పుడేమైనా రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చేసిందనా ఈ స్నేహం? లేక టిడిపి బిజెపి దోస్తానా ఉన్న రోజుల్లోనే ప్రత్యేక హోదా కాదు 'ప్యాకేజి' అంటూ సంబరపడిపోయిన విషయాన్ని నెమరు వేసుకుంటున్నారా? దాంతోనే సరిపెట్టుకోవాలని చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు మళ్లీ చెప్ప దలచుకున్నారా? ప్రత్యేక హోదా అంశాన్ని చంద్రబాబు మర్చిపోయినా ఆంధ్రప్రదేశ్ ప్రజలు మరువగలరా? కడప ఉక్కు, విశాఖ రైల్వే జోన్, ఆర్థిక లోటు, ఉన్నత విద్యా సంస్థలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజి తదితర విభజన హామీల గురించి చంద్రబాబుకు గుర్తు లేదా? జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికి ముఖ్యంగా నిర్వాసితుల పునరావాసానికి నిధులివ్వని కేంద్రాన్ని నిలదీయరెందుకు? విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కంటూ 32 మంది యువ కిశోరాల ప్రాణ త్యాగంతో సాధించుకున్న స్టీల్ ప్లాంటును తెగనమ్మేస్తామంటున్న బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి కూడా ఆయన సిద్ధపడలేదెందుకు? జై ఆంధ్ర, జై తెలంగాణ అన్నవి కొందరు వ్యక్తులు లేదా అందుకు ఏర్పడిన సంస్థలు మాత్రమే లేవనెత్తగా 'ఒక ఓటు- రెండు రాష్ట్రాలు' అంటూ ఉమ్మడి రాష్ట్రంలో విభజన చిచ్చును రాజేసిన రాజకీయ పార్టీగా బిజెపి విచ్ఛిన్నకర పాత్రను తెలుగు ప్రజలు ఎన్నటికీ మరువజాలరు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని స్థానాల్లో టిడిపి ఒంటరిగానే పోటీ చేస్తుందని చంద్రబాబు వెల్లడించారంటే ఎపిలో బిజెపితో కలిసి వెళ్లడానికి సమాయత్తమవుతున్నట్లేనా? బహుశ అందుకే బిజెపితో అంతర్గతంగా ఏం చర్చిస్తున్నామనేది మీకు తెలీదని ఆయన మీడియా ప్రతినిధులకు విడమర్చినట్టుంది. దేశ నిర్మాణంలో భాగం కావాలన్నది తన ఉద్దేశమని, అది ఎలా అనేది కాలం నిర్ణయిస్తుందని పేర్కొనడమూ అందులో భాగమే కావచ్చు. 1983 నుంచే టిడిపి జాతీయ కూటముల్లో భాగస్వామిగా ఉందని, జాతీయ రాజకీయాలతో టిడిపికి అనుబంధం ఉందని చెప్పిన ఆయన 'తెలుగు ప్రజల ఆత్మగౌరవ' నినాదంతో కేంద్రం పెత్తనానికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర వివరిస్తే బాగుండేది. రాష్ట్రాల హక్కుల కోసం ఆనాడు ఎన్‌టి రామారావు ఆధ్వర్యంలో జరిగిన ప్రతిపక్ష ముఖ్యమంత్రులతో సభల గురించి గుర్తు చేసి ఉండాల్సింది. కాని, వాటిని ప్రస్తావిస్తే ఇప్పుడు మోడీ అమిత్ షా ద్వయం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై సాగిస్తున్న దండయాత్రలను, గవర్నర్లను అడ్డం పెట్టుకొని, ఇడి, సిబిఐలను ఉసిగొల్పి రాత్రికి రాత్రే రాష్ట్ర ప్రభుత్వాలను మార్చేస్తున్న కుట్రలను కూడా విమర్శించాల్సి వస్తుంది. కనుక వాటిని ప్రస్తావించరు... వారినేమీ అనరు. ఇదీ చంద్రబాబు తీరు.

అనేక విషయాలను వివరించిన చంద్రబాబు దేశాన్ని కుదిపేసిన మణిపూర్ హింసాకాండ గురించి మాట మాత్రమైనా ఎందుకు ప్రస్తావించలేదు? అక్కడి మహిళల వలువలూడదీసిన దుశ్శాసన పర్వం ఆయన మదిని కలచివేయలేదా? హర్యానాలో నుహ్ లేదా మధ్యప్రదేశ్‌లో మైనారిటీలపై సాగుతున్న దాడులు, ఉత్తరప్రదేశ్‌లోని బుల్డోజర్ రాజ్ గురించి ఆయన ఒక్క మాట కూడా ఎందుకు చెప్పలేదు? ప్రజల్లో విద్వేషాన్ని సృష్టించి మైనారిటీలను అభద్రతకు గురి చేసి సంఘపరివార్ శక్తులు సాగిస్తున్న విధ్వంసాన్ని చంద్రబాబు ఎందుకు తప్పుబట్టలేదు? మత ఘర్షణలను కట్టడి చేయడానికి పటిష్ట చర్యలు చేపట్టి భాగ్యనగరంలోనూ యావత్ ఉమ్మడి రాష్ట్రంలో ప్రశాంత పరిస్థితులను నెలకొల్పిన ఎన్‌టి రామారావు స్థాపించిన పార్టీ అధినేత ఇప్పుడిలా ఎందుకు మాట్లాడుతున్నారు? ప్రతిపక్షాల ఇండియా బ్లాక్ ఎలా ముందుకు వెళ్తుందో చూడాలని, ఆ కూటమికి నాయకుడు లేకపోవడం బిజెపికి అనుకూల అంశమన్న చంద్రబాబు నర్మగర్భ వ్యాఖ్యల ఆంతర్యమేమిటి? గతంలో అంటే 1977 తరువాత కేంద్రంలో అధికారానికొచ్చిన ప్రతిపక్ష కూటములు ఎన్నికలకు ముందే ఒక ఉమ్మడి ప్రణాళిక లేదా నాయకత్వం ఎవరన్నది వెల్లడించకుండానే జరిగిన విషయం ('చక్రం తిప్పిన') ఆయనకు తెలియదా? మరి ఈ వ్యాఖ్యానాలు ఎవరిని సంతృప్తిపరచడానికి?

అదానీ, అంబానీ, టాటా అంటూ కొందరికే ఆస్తులు సృష్టించే కంటే ప్రతి కుటుంబానికి ఆస్తి సృష్టించే అవకాశం కల్పించాలని చంద్రబాబు చెప్పిన మాటలు వినడానికి బాగానే ఉండొచ్చు. కానీ బడా కార్పొరేట్లకు భారీ రాయితీలిచ్చి ఖజానాను డొల్ల చేస్తున్న మోడీ విధానాల గురించి మాట్లాడకపోతే ఎలా? లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ రంగ బ్యాంకుల రుణాలను మాఫీ చేయడాన్ని ప్రశ్నించాలి కదా! ప్రధాని మోడీ అనుంగు మిత్రుడైన గౌతమ్ అదానీ సాగించిన ఘరానా దోపిడీ గురించి హిండెన్‌బర్గ్ నివేదిక తేటతెల్లం చేసిన విషయాల గురించైనా చంద్రబాబు ప్రస్తావించలేదెందుకు? రాఫెల్ కుంభకోణం వంటి క్రోనీ క్యాపిటల్ మాయాజాలం మాటేమిటి? ఇవేవీ చంద్రబాబు మాట్లాడలేరు. ఎందుకంటే ఆయనవీ అవే విధానాలు కనుక! ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు విద్యుత్ సంస్కరణల పేరిట విధ్వంసాన్ని ప్రారంభించింది ఆయనే కదా! ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విధిస్తున్న విద్యుత్ ట్రూ అప్ చార్జీల విధానం చంద్రబాబు హయాంలో రూపుదిద్దుకున్నది కాదా? తాము అధికారానికి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని చెబుతున్నారేతప్ప జనం నడ్డి విరిచే ట్రూ అప్ విధానాన్ని రద్దు చేస్తామనడం లేదు. ఇప్పుడు జనం మీద వేస్తున్న చెత్త పన్నుకు పెట్టిన ముద్దు పేరు యూజర్ చార్జీలన్న మాట టిడిపి పాలనలో పుట్టినదే కదా! ధర్మాసుపత్రిలో ఓపి చీటీకి డబ్బు కట్టించిందీ ఆనాడే! ఇక ప్రైవేటీకరణ విధానాల గురించి చెప్పనక్కరలేదు. ప్రజలపై వైసిపి సర్కారు వేస్తున్న భారాలను విమర్శించడం మాత్రమే చాలదు. ఆ విధానాలను వ్యతిరేకించాలి. కాని ప్రజల శ్రేయస్సు కోసం అంత సాహసం చేయగలరా? ఎందుకంటే బిజెపి, వైసిపి, టిడిపి ఇలాంటి పార్టీలన్నీ అనుసరించేది నయా ఉదారవాద ఆర్థిక విధానాలే కనుక!

సంపన్నుల దోపిడీకి కొమ్ము కాయడంతోపాటు దేశ ఖజానాను వారికి దోచిపెట్టడం, అందుకోసం ప్రజల మధ్య విద్వేషాలు రగుల్కొల్పడం ఈనాటి బిజెపి కేంద్ర ప్రభుత్వ విధానంగా ఉంది. వినాశకరమైన ఈ కార్పొరేట్ మతతత్వ కూటమిని గద్దె దించడమే దేశ ప్రజల ముందున్న మార్గం. అందుకోసం సాగే మహోద్యమంలో భాగస్వాములయితేనే ఎవరైనా చరిత్రలో నిలుస్తారు. కనుక ఇప్పటికైనా టిడిపి దాగుడుమూతలు మాని కేంద్ర ప్రభుత్వ పెత్తనాన్ని ప్రతిఘటించడానికి, సంఘపరివార్ మత విద్వేష కుట్రలకు వ్యతిరేకంగానూ నిలబడాలి. ప్రజల పక్షాన పోరాడాలి. అలా వ్యవహరిస్తేనే అది ఎన్‌టి రామారావు వారసత్వాన్ని కొనసాగించినట్టవుతుంది. టిడిపి శ్రేణులు, అభిమానులు, అనుయాయులు ఆ దిశగా ఆలోచిస్తారా..! నాయకత్వం పునరాలోచిస్తుందా...!

- గిరిపుత్ర

అందరికీ నాణ్యమైన విద్య అందించలేమా?



జి. వెంకటేశ్వరరావు

వేద కాలంలో, రాచరిక పాలనలో కొందరికే పరిమితమైన విద్యను ప్రజాస్వామ్యం సార్వత్రీకరించింది. అందరికీ విద్య అనేది ఆధునిక ప్రజాస్వామ్య దేశాల లక్షణం. ప్రపంచాన్ని మార్చడానికి అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని హక్కుల సూర్యుడు నెల్సన్ మండేలా అంటారు. భారతదేశం 75 సంవత్సరాల అమృత ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో కూడా 100 శాతం అక్షరాస్యతను సాధించడానికి ఆమడదూరంలో ఆగిపోయింది. ఆరు నుండి 14 సంవత్సరాల లోపు వారందరికీ ఉచిత సార్వత్రిక విద్యను రాజ్యాంగం అమలులోకి వచ్చిన పది సంవత్సరాల లోపు అందించాలని ఆశించిన రాజ్యాంగ నిర్మాతలు ఆర్టికల్ 45 ద్వారా ఆదేశ సూత్రాలలో పొందుపరిచారు. యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ 1959 నవంబర్ 20న ఆర్టికల్ 29 ద్వారా 6 నుండి 14 సంవత్సరాలు అందరికీ విద్య హక్కుగా అందించాలని సూచించింది. భారతదేశంలో అర్ధ శతాబ్దం పాటు అనేకమంది విద్యావేత్తలు, సామాజికవేత్తల కృషి ఫలితంగా 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21 ఏ ఆర్టికల్ చేర్చడంతో విద్యా హక్కును ఈ దేశ పౌరులు పొందగలిగారు.

కానీ నేటికీ 6 నుండి 14 సంవత్సరాల పిల్లలు 1.3 కోట్ల మంది బడి ముఖం చూడని వారు ఉన్నారనే వాస్తవం దేశం రాజ్యాంగ లక్ష్యాలను సాధించడంలో తడబాటును తెలియజేస్తుంది. విద్యాహక్కు చట్టం చేసి 13 సంవత్సరాలు గడిచినప్పటికీ విద్యా హక్కును పొందలేని అభాగ్యులు దేశంలో నేటికీ ఉన్నారు. వీరిలో కూడా ఎస్సీ ఎస్టీలు ఆ తర్వాత బీసీలు అధిక శాతంగా ఉండడం శోచనీయం. బడిలో చేరిన పిల్లలు కూడా పదవ తరగతి లోపే 12.6 శాతం మంది, ఎనిమిదో తరగతి లోపు 3 శాతం మంది, ఐదో తరగతి లోపు 2 శాతం మంది పాఠశాల వదిలి బాల కార్మికులుగా మారుతున్నారని యుడిఐఎస్ఇ 2021-22 నివేదిక చెప్తున్నది. మన రాష్ట్రంలో మరింత ఎక్కువగా పదో తరగతి లోపు 16.7 శాతం మంది బడి మానేస్తున్నారు. పాఠశాలలో చేరిన పిల్లలకు కూడా నాణ్యమైన విద్య అనేది ఎండమావి గానే మారిందని అసర్ రిపోర్టు 2022 ద్వారా స్పష్టం అవుతుంది. రెండవ తరగతి పాఠ్యపుస్తకాన్ని చదవగలిగిన మూడవ తరగతి పిల్లలు 20.5 శాతం, ఐదవ తరగతి పిల్లలు 42.8 శాతం మంది మాత్రమే ఉన్నారు. 69.6 శాతం మంది ఎనిమిదవ తరగతి పిల్లలు మాత్రమే చాలా సాధారణమైన టెక్స్టుని చదవగలుగుతున్నారు. మూడో తరగతి పిల్లలలో తీసివేతలు చేయగలిగిన వారు 25.9 శాతం, 5వ తరగతి పిల్లలలో భాగాహారం చేయగలిగిన వారు 25.6 శాతం, ఎనిమిదో తరగతి పిల్లలలో భాగాహారం చేయగలిగిన వారు 44.7 శాతం మాత్రమే ఉన్నారని అసర్ రిపోర్టు తెలియజేస్తున్నది. ఈ రిపోర్టులోని అంకెలు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వాల బాధ్యతను స్పష్టంగా



తెలియజేస్తున్నాయి. ఉపాధ్యాయుల కొరత, అదేవిధంగా 65.5 శాతం పాఠశాలల్లో రెండు లేదా అంతకంటే ఎక్కువ తరగతులు ఒకే తరగతి గదిలో బోధించడం అనేది విద్య నాణ్యతలో లోపాలకు కారణాలు.

పేదరికం తీవ్ర ఆటంకం

పేదలు అత్యధికంగా (22.89 కోట్ల మంది) ఉన్న దేశం భారత్ అని ఆక్స్‌ఫామ్ నివేదిక తెలియజేస్తున్నది. సంపద పంపిణీలో తీవ్ర అసమానతలు విద్యాభివృద్ధికి ప్రధాన ఆటంకంగా ఉన్నాయి. నివేదిక ప్రకారం దిగువ నుంచి 50 శాతం మంది ప్రజల వద్ద దేశ సంపదలో 3 శాతం ఉంటే, మొదటి 30 శాతం మంది వద్ద సంపదలో 90 శాతం పోగుబడి ఉంది. అంతేకాక మొదటి పది శాతం మంది దగ్గర 80 శాతం సంపద పోగు పడిందంటే అసమానతలు ఎంత తీవ్ర స్థాయిలో ఉన్నాయో అర్థం అవుతుంది. మొదటి ఒక శాతం మంది దగ్గర 45.6 శాతం దేశ సంపద కేంద్రీకృతమైంది. పిల్లలందరినీ పాఠశాలలో చేర్చడానికి అవసరమైన 1.4 లక్షల కోట్ల నిధిని మొదటి వందమంది బిలియనీర్లపై 2.5 శాతం పన్ను వసూలు చేయడం లేదా మొదటి పదిమంది బిలియనీర్ల వద్ద 5 శాతం చొప్పున పన్ను విధించడం ద్వారా రాబట్టవచ్చు. కానీ కేంద్ర ప్రభుత్వ పన్నుల విధానం అసమానతలు మరింత పెంచే విధంగా ఉన్నాయి.

విద్యారంగ కేటాయింపులు

కొఠారి కమిషన్ సార్వత్రిక విద్యను సాధించడం కోసం జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలని సూచించింది. కానీ ఇప్పటివరకు మూడు శాతానికి మించి నిధులను కేటాయించకపోవడం పాలకులకు రాజ్యాంగ లక్ష్యాల సాధనలో చిత్తశుద్ధిని తెలియజేస్తున్నది. బడ్జెట్లో అత్యధిక నిధులను కేటాయిస్తున్న కేరళ ప్రభుత్వం దేశంలోనే సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించిన మొదటి రాష్ట్రం. 1990లో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రారంభం అయిన తర్వాత ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకుని విద్యా రంగాల్లో ప్రైవేటీకరణను విధానాలు ప్రవేశపెట్టడంతో దేశంలోనే కుటుంబ ఆదాయంలో అధిక శాతం విద్యకు ఖర్చు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాక ఈ ప్రైవేటీకరణ వలన సమానత్వాన్ని సాధించడానికి బదులు విద్యలో అసమానతలు ఆర్థిక అసమానతలకు కారణంగా మారింది. రాష్ట్రంలో జీవో 117 పేరుతో పాఠశాలల విలీనం, ఉపాధ్యాయ పోస్టుల కుదింపును దీనిలో భాగంగానే చూడాలి.

పాఠశాల స్థాయిలో బాలికలు బడి మానేయడానికి పాఠశాలలో టాయిలెట్ల సౌకర్యం లేకపోవడం, పాఠశాల అనంతరం ఇంటి పనులు చేయవలసి రావడం, బాలికల రక్షణకు సంబంధించిన ఆందోళన వంటివి కారణాలుగా ఉన్నాయి. విద్యార్థుల మధ్య డిజిటల్ విభజన కూడా విద్యా అసమానతలకు కారణం అవుతున్నది.

మానవాభివృద్ధి సూచీలో 191 దేశాల్లో 132వ స్థానానికి భారతదేశం పడిపోవడం అనేది దేశ నిజమైన అభివృద్ధిని సూచించదు. దేశ అక్షరాస్యతను 100 శాతం పెంచడానికి, అందరికీ విద్య నుండి అందరికీ నాణ్యమైన విద్య దిశగా పయనించడానికి ప్రధాన అవరోధాలుగా ఉన్న సంపద పంపిణీని సరిచేయటం, విద్యారంగానికి జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించడం, లింగ వివక్షత రూపుమాపడం, పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలు పూరించడం, టాయిలెట్ల వంటి ప్రాథమిక సౌకర్యాలను పెంచడం ద్వారా మాత్రమే భారతదేశం నిజమైన అభివృద్ధిని సాధించగలదు.

/ వ్యాసకర్త యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, గుంటూరు, సెల్ : 9966135289 /

యుపిలో మరో ఘోరం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో మరో ఘోరం జరిగింది. లక్నోలో ఒక కేంద్ర మంత్రి కుమారుడి నివాసంలో ఒక యువకుడ్ని తుపాకీతో కాల్చి చంపారు. మృతుడ్ని మంత్రి కుమారుడి స్నేహితుడిగా పోలీసులు గుర్తించారు. లక్నోలోని ఠాగూర్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెగరియా గ్రామంలో కేంద్ర మంత్రి కౌషల్ కిషోర్ కుమారుడు వికాశ్ కిషోర్ నివాసంలో శుక్రవారం తెల్లవారు జామున 4:15 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. మృతుడిని మంత్రి కుమారుడి స్నేహితుడు వినయ్ శ్రీవాత్సవగా గుర్తించారు. హత్యకు కారణమైన తుపాకీ మంత్రి కుమారుడిదని తెలిసింది.

ఆర్టికల్ 370 రద్దు కార్యనిర్వాహక నిర్ణయం కాదు

- సుప్రీంకోర్టులో కేంద్రం

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్ ప్రత్యేక హోదా, ఆర్టికల్ 370 రద్దు అనేది కార్య నిర్వాహక నిర్ణయం కాదని, జమ్ముకాశ్మీర్ సభ్యులు కూడా ఉన్న యావత్తు పార్లమెంట్ తీసుకున్న నిర్ణయమని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. ఈ విషయంపై దాఖలైన పిటీషన్ల విచారణ వరసగా 14 రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. కేంద్రం తరపున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది తన వాదనలు వినిపించారు. ఆర్టికల్ 370 రద్దు కార్యనిర్వాహక నిర్ణయం కాదని తెలిపారు. సుప్రీంకోర్టు ఈ విచారణను సెప్టెంబరు నాలుగుకు వాయిదా వేసింది.

నెల్లూరులో యూనియన్ బ్యాంక్ డిజిటల్ మేళా..

నెల్లూరు : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీసు నెల్లూరులో డిజిటల్ మేళాను నిర్వహించినట్లు తెలిపింది. శుక్రవారం మద్రాస్ బస్టాండ్ సమీపంలో దీన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ జ్ఞానరంజన్ సారంగి, రీజినల్ మేనేజర్ కె జోగారావు, మార్కెట్ కమిటీ ఎడిఎం అనిత, మార్కెట్ వ్యాపారస్తులు ముక్కం నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ చెల్లింపులకు వీలుగా వ్యాపారస్తులకు బ్యాంక్ అధికారులు క్యూఆర్ కోడ్స్‌ను పంపిణీ చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంక్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని సారంగి పేర్కొన్నారు. చిరు వ్యాపారస్తులను డిజిటలైజేషన్‌లో వారిని భాగస్తులుగా చేయడం తమ బ్యాంక్ లక్ష్యమన్నారు. అనంతరం బాలాజీనగర్‌లోని అంజనా రూరల్ డెవలప్‌మెంట్ వాలంటరీ ఆర్గనైజేషన్‌కు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా వాటర్ ప్యూరీఫైయర్‌ను, నిత్యావసర సరుకులు అందజేశారు.

టిఎంసి, బిజెపిలను ఓడిద్దాం

- 1959 ఆహార ఉద్యమ అమర వీరుల సంస్మరణ సభలో వక్తల పిలుపు
- కోల్‌కతాలో కదంతొక్కిన ఎర్రదండు



1959 ఆహార ఉద్యమ అమర వీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్‌డి సలీం

కోల్‌కతా : 1959-ఆహార ఉద్యమం అమరవీరులకు కోల్‌కతాలో వేలాదిమంది ఘనంగా నివాళులర్పించారు. భారీ వర్షాలు కురుస్తున్నా లెక్కచేయకుండా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది నగరంలోని ధరంతల వద్ద గురువారం సమావేశమయ్యారు. అమరవీరులను గుర్తుకు తెచ్చుకున్నారు. 1959 ఆగస్టు 31న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఆహార ఉద్యమాన్ని క్రూరంగా అణిచివేసింది, మొత్తంగా 112 మందిని పొట్టన పెట్టుకుంది. గురువారం నిర్వహించిన సభకు లెఫ్ట్‌ఫ్రంట్ ఛైర్‌పర్సన్ బిమన్ బసు, సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీం, ఇతర నాయకులు హాజరయ్యారు. సభకు విచ్చేసిన వేలాది మంది ఒక నిమిషం పాటు మౌనం పాటించి అమరవీరులకు నివాళి తెలిపింది. అమరవీరుల స్మారకార్థం గురువారం ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించగా, తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో సభ ఏర్పాటు చేశారు. అయినా ప్రజలు నగరంలోని సీల్దా, హౌరా స్టేషన్ల నుంచి నగరం నడిబొడ్డు వరకూ భారీ మార్చ్ నిర్వహించారు. ఆ మార్గాలన్నీ అరుణ పతాక రెపరెపలతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి.

టిఎంసి, బిజెపిలపై పోరాడండి

సభలో బిమన్‌బసు ప్రసంగిస్తూ టిఎంసి, బిజెపి ఒకే విధమైన పార్టీలని, రెండింటిపైనా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. 1959 ఆగస్టు 31న జరిగిన సంఘటనలు గురించి బిమన్ బసు వివరిస్తూ.. 'ఆ రోజున ఆకలితో ఉన్న 50 వేల మందికి పైగా ప్రజలు జోరువానలో తడుస్తూ ఆహారం, న్యాయమైన రేషన్ వ్యవస్థ కోసం ర్యాలీగా నగరానికి తరలివచ్చారు. అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సహాయంతో ఆ ర్యాలీని గ్రేట్ ఈస్టర్న్ హోటల్ ముందు అడ్డగించింది. దారుణంగా లాఠీఛార్జ్ చేయించింది. అప్పటి ముఖ్యమంత్రి బిసి రాయ్ చేయించిన ఈ క్రూరమైన లాఠీఛార్జ్‌లో 80 మంది ప్రాణాలు కోల్పోయారు. కొన్ని వందల మందిని నిర్దాక్షిణ్యంగా హింసించారు. ఈ లాఠీఛార్జ్ తరువాత కూడా కొన్ని రోజుల పాటు ప్రజల నిరసన కొనసాగింది. పోలీసు చర్య కారణంగా మొత్తం 112 మంది మరణించారు' అని తెలిపారు.

ఎండి సలీం మాట్లాడుతూ '1959 ఆహార ఉద్యమానికి ముందు 1943లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆహార మంత్రిగా ఉన్న సమయంలో ప్రజలు తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు' అని చెప్పారు. 'సాధారణ ప్రజల జీవితాలను పణంగా పెట్టి రెండో ప్రపంచ యుద్ధంలో సైనికుల కోసం ఆహార వనరులను మళ్లించడానికి ముఖర్జీ బాధ్యతారహిత్యంగా అనుమతించిన కారణంగా కరువు ఏర్పడింది' అని సలీం తెలిపారు. మెరుగైన పశ్చిమ బెంగాల్ నిర్మాణం కోసం టిఎంసి, బిజెపిలను ఓడిస్తామని సమావేశానికి హాజరైన ప్రజల చేత సలీం ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, ఎన్నికల సమయంలో సుమారు వంద మందిని బలి తీసుకున్నారని, వారి త్యాగం వృథాగా పోదని పేర్కొన్నారు. ఈ సభలో డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్‌ఐ) రాష్ట్ర కార్యదర్శి మీనాక్షి ముఖర్జీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి స్వపన్ బెనర్జీ, ఫార్వర్డ్ బ్లాక్ బెంగాల్ కమిటీ కార్యదర్శి నరేన్ ఛటర్జీ, రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తపన్ హోరే తదితరులు ప్రసంగించారు.

అధికార మదంతో బిజెపి విధ్వంసం

- సంఘటిత ఉద్యమాలతో ప్రతిఘటన : బి. వెంకట్

అగర్తల : అభివృద్ధి మార్గంలో ఉన్న త్రిపురలో జాతి, మతం పేరుతో పేరుతో బిజెపి విధ్వంసం సృష్టిస్తున్నదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ విమర్శించారు. గత రెండు రోజులుగా త్రిపుర గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తున్నా ఆయన శుక్రవారం నాడిక్కడ మీడియాతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో జరుగుతున్న దురాగతాలను వెల్లడించారు. నాటి వామపక్ష పాలనలో అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాన్ని ఇప్పుడు ఆకలి చావులు, ఆత్మహత్యలు, అరాచకాలతో కల్లోల రాష్ట్రంగా అధికార బిజెపి మార్చిందని విమర్శించారు. ఆదివాసీల హక్కులను పరిరక్షించడంలో అగ్రభాగాన ఉండటంతో పాటు గిరిజనేతర ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలోనూ నాటి ప్రభుత్వం ప్రగతి శీలంగా వ్యవహరించిందని తెలిపారు. ఉపాధి హామీని గత వామపక్ష ప్రభుత్వం సగటున ఏడాదికి 98 పనిదినాలు కల్పించి, దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. కువాయి, అగర్తలా తూర్పు, పశ్చిమ, ఉత్తర జిల్లాలలోని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనిని పరిశీలిస్తే ఆ చట్టం స్ఫూర్తికే విరుద్ధంగా ఉందని చెప్పారు. దీనితో ఆ ప్రాంతంలో గ్రామీణ పేదల ఆకలి చావులు ప్రారంభమయ్యాయనీ, ప్రత్యేకించి గిరిజనులు నివసించే ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువైందని అన్నారు.

సింగపూర్ అధ్యక్షుడిగా షణ్ముగరత్నం

- భారత సంతతి వ్యక్తి గెలుపు



షణ్ముగరత్నం

సింగపూర్: సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో భారత సంతతి వ్యక్తి విజయం సాధించారు. మాజీ ఉపప్రధానమంత్రి ధర్మన్ షణ్ముగరత్నం శుక్రవారం సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. 66 ఏళ్ల షణ్ముగరత్నం విజయాన్ని ఎన్నికల కమిటీ ధ్రువీకరించింది. 2011 తర్వాత సింగపూర్‌లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో ఇద్దరు చైనా సంతతికి చెందిన అభ్యర్థులను ఓడించి షణ్ముగరత్నం నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2011 నుంచి 2019 వరకు సింగపూర్ ఉప ప్రధానిగా పనిచేసిన షణ్ముగరత్నానికి 70.4శాతం ఓట్లు రాగా.. ఆయన ప్రత్యర్థులు ఎంగ్ కోక్‌సోంగ్, టాన్ కిన్ లియాన్‌లకు వరుసగా 15.7 శాతం, 13.88శాతం ఓట్లు వచ్చినట్లు ఎన్నికల కమిటీ అధికార ప్రతినిధి వెల్లడించారు. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన ధర్మన్‌కు సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్ అభినందనలు తెలిపారు. సింగపూర్ ప్రస్తుత అధ్యక్షురాలు హలీమా యాకూబ్ పదవీకాలం ఈనెల 13న ముగియనుంది. షణ్ముగరత్నం సింగపూర్‌లో 2011 నుంచి 2019 మధ్యకాలంలో ఆర్థిక, విద్యాశాఖ మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా సేవలందించారు. రాజకీయాల్లోకి రాకముందు ఆర్థికవేత్తగా, పౌర సేవకుడిగా ఉండేవారు.

బీహార్ మాజీ ఎంపికి జీవిత ఖైదు

న్యూఢిల్లీ : బీహార్‌లో 1995 జంట హత్యల కేసులో లోక్‌సభ మాజీ సభ్యుడు ప్రభునాథ్ సింగ్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం జీవితఖైదు విధించింది. 28 ఏళ్ల నాటి హత్య కేసులో ప్రభునాథ్ సింగ్ దోషిగా 2017లో నిర్ధారణ కావడంతో.. జార్ఖండ్‌లోని హజారీబాగ్ జైలులో ఉన్నారు. సరన్ జిల్లాలోని మస్రఖ్ నియోజకవర్గానికి చెందిన జనతాదళ్ ఎమ్మెల్యే అశోక్ సింగ్ 1995 జులై 3న పాట్నాలో తన అధికారిక నివాసంపై జరిగిన బాంబు దాడిలో మరణించారు. అంతకుముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అశోక్‌సింగ్ చేతిలో ప్రభునాథ్‌సింగ్ ఓడిపోయాడు.

5 కమిటీల నియామకం

ఇండియా ఫోరం కీలక ముందడుగు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముంబయిలో జరిగిన ఇండియా ఫోరం సమావేశం సమన్వయ కమిటీతోపాటు ఐదు కమిటీలను నియమించింది. 14 మందితో సమన్వయ కమిటీ, ఎన్నికల వ్యూహ కమిటీని ప్రకటించింది. కెసి వేణుగోపాల్ (కాంగ్రెస్), శరద్ పవార్ (ఎన్‌సిపి), టిఆర్ బాలు (డిఎంకె), జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ (జెఎంఎం), సంజయ్ రౌత్ (శివసేన), బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ (ఆర్‌జెడి), అభిషేక్ బెనర్జీ (టిఎంసి), రాఘవ్ చద్దా (ఆప్), జావేద్ ఖాన్ (ఎస్‌పి), లలన్ సింగ్ (జెడియు), డి రాజా (సిపిఐ), ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తీ (పిడిపి) ఈ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. ఈ కమిటీకి కన్వీనర్‌ను ప్రకటించలేదు. ఈ కమిటీలో సిపిఎంకు ఒక స్థానం కేటాయించారు. సిపిఎం తన ప్రతినిధి పేరును త్వరలో తెలియజేస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. తమ పార్టీలు చర్చించాల్సి ఉందన్నారు.

19 మందితో ప్రచార కమిటీ

ఇండియా ఫోరం 19 మందితో ప్రచార కమిటీని నియమించింది. గుర్దీప్ సింగ్ సప్పల్ (కాంగ్రెస్), సంజయ్ ఝా (జెడియు), అనిల్ దేశాయ్ (శివసేన-థాకరే), సంజయ్ యాదవ్ (ఆర్‌జెడి), పిసి చాకో (ఎన్‌సిపి), చంపై సోరెన్ (జెఎంఎం), కిరణ్మోయ్ నందా (ఎస్‌పి), సంజయ్ సింగ్ (ఆప్), అరుణ్ కుమార్ (సిపిఎం), బినోయ్ విశ్వం (సిపిఐ), జస్టిస్ (రిటైర్డ్) హస్నైన్ మసూది (నేషనల్ కాన్ఫరెన్స్), షాహిద్ సిద్ధిఖీ (ఆర్‌ఎల్‌డి), ఎన్ కె ప్రేమచంద్రన్ (ఆర్‌ఎస్‌పి), దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్) రవి రాయ్ (సిపిఐ(ఎంఎల్)), తిరుమావలన్ (విసికె), కెఎం కాదర్ మొయిదిన్ (ఐయుఎంఎల్), జోస్ కె. మణి (కెసి(ఎం)) ఈ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. టిఎంసి తరువాత పేరు ఇస్తుంది.

12 మందితో సోషల్ మీడియా వర్కింగ్ గ్రూప్

12 మందితో సోషల్ మీడియా వర్కింగ్ గ్రూప్‌ను ఇండియా ఫోరం నియమించింది. సుప్రియా శ్రీనాటే (కాంగ్రెస్), సుమిత్ శర్మ (ఆర్‌జెడి), ఆశిష్ యాదవ్, రాజీవ్ నిగమ్ (ఎస్‌పి), రాఘవ్ చద్దా (ఆప్), అవిందాని (జెఎంఎం), ఇల్తిజా మెహబూబా (పిడిపి), ప్రాంజల్ (సిపిఎం), డాక్టర్ భాలచంద్రన్ కాంగో (సిపిఐ), ఇఫ్రా జా (నేషనల్ కాన్ఫరెన్స్), వి అరుణ్ కుమార్ (సిపిఐ(ఎంఎల్)) ఈ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. టిఎంసి తరువాత పేరు ఇస్తుంది.


19 మందితో మీడియా వర్కింగ్ గ్రూప్

19 మందితో మీడియా వర్కింగ్ గ్రూప్ ఏర్పడింది. జైరాం రమేష్ (కాంగ్రెస్), మనోజ్ ఝా (ఆర్జెడి), అరవింద్ సావంత్ (శివసేన-థాకరే), జితేంద్ర అహ్వాద్ (ఎన్‌సిపి), రాఘవ్ చద్దా (ఆప్), రాజీవ్ రంజన్ (జెడియు), ప్రాంజల్ (సిపిఎం), ఆశిష్ యాదవ్, (ఎస్పీ), సుప్రియో భట్టాచార్య (జెఎంఎం), అలోక్ కుమార్ (జెఎంఎం), మనీష్ కుమార్, (జెడియు), రాజీవ్ నిగమ్ (ఎస్పీ), భాలచంద్రన్ కాంగో (సిపిఐ), తన్వీర్ సాదిక్ (నేషనల్ కాన్ఫరెన్స్), ప్రశాంత్ కన్నోజియా, నరేన్ ఛటర్జీ (ఫార్వర్డ్ బ్లాక్), సుచేతా దే (సిపిఐఎంఎల్), మోహిత్ భాన్ (పిడిపి)లను నియమించారు. టిఎంసి తరువాత పేరు ఇస్తుంది.

ఐదుగురితో రీసెర్చ్ వర్కింగ్ గ్రూప్

ఇండియా ఫోరం ఐదుగురితో రీసెర్చ్ వర్కింగ్ గ్రూప్‌ను నియమించింది. అమితాబ్ దూబే (కాంగ్రెస్), ప్రొఫెసర్ సుబోధ్ మెహతా (ఆర్‌జెడి), ప్రియాంక చతుర్వేది (శివసేన-థాకరే), వందనా చవాన్ (ఎన్‌సిపి), కెసి త్యాగి (జెడియు)లను నియమించింది.సమన్వయ, ఎన్నికల వ్యూహ కమిటీ కన్వీనర్, ఛైర్‌పర్సన్ స్థానాలను త్వరలో ప్రకటించనున్నారు. ఈ స్థానాల్లో నియమితులయ్యే వారు ఇండియా ఫోరం ప్రధానమంత్రి అభ్యర్థి అవుతారనే చర్చను నివారించడానికి ఇది జరిగింది.

మోడీకి కౌంట్‌డౌన్ మొదలైంది



ఏచూరితో మాట్లాడుతున్న ఉద్ధవ్ థాకరే

(మొదటి పేజీ తరువాయి)

అలీ ఖాన్ (సమాజ్‌వాది), ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తీ (పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ), డి.రాజా (సిపిఐ), సంజయ్ రౌత్ (శివసేన-ఉద్ధవ్ థాకరే), లలన్ సింగ్ (జెడియు), హేమంత్ సోరేన్ (జెఎంఎం) సభ్యులుగా ఉంటారు.

బిజెపికి అధికారం కల్ల

ఈ వేదిక దేశంలోని 60 శాతం ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తోందని సమావేశాన్ని ఉద్దేశించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. ఈ పార్టీలన్నీ ఏకమైతే బిజెపి అధికారంలోకి రావడం అసంభవమని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలన్నీ సమర్థవంతంగా పని చేయాలని, అందుకోసమే సమన్వయ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. నాయకుల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించు కుంటామన్న నమ్మకం తమకు ఉన్నదని అన్నారు. కలసికట్టుగా పని చేయాలని నిర్ణయించామని, దేశ ప్రజలు త్వరలోనే ఇండియా ఫోరమ్ ప్రభుత్వాన్ని చూస్తారని జెడియు నేత నితీష్ కుమార్ చెప్పారు. ప్రతిపక్ష కూటమి మధ్య విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో కథనాలు వస్తాయని, కానీ రాబోయే రోజులలో తమ సమావేశాలకు హాజరై వాస్తవాలు గ్రహిస్తాయని ఆమాద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. 'మన యువతకు ఉద్యోగాలు లేవు. కానీ ప్రభుత్వం మాత్రం ఓ కంపెనీ కోసం పనిచేస్తోంది. ప్రజలకు ఆదాయం లేదు. కానీ ప్రభుత్వం మాత్రం నిధులన్నింటినీ ఒక వ్యక్తి కోసం మళ్లిస్తోంది' అని మండిపడ్డారు.

ఇండియా బ్యానర్ ప్రతిపక్షాలను ఏకం చేసిందని డిఎంకె అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. ఆయన తమిళంలో ప్రసంగించారు. ప్రతిపక్షాలు వేర్వేరుగా ఉన్నందునే ఇప్పటివరకు మోడీ ఆటలు సాగాయని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ చెప్పారు. ఈ దేశంలో మైనారిటీలకు రక్షణ లేదని, బిజెపిని ఓడించి దేశాన్ని రక్షించుకోవాలని మొదటి నుండీ తాము చెబుతూనే ఉన్నామని ఆయన అన్నారు.

దాడులకు వెరవం

సమావేశం విజయవంతమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు. ప్రతిపక్ష సమావేశాలు విజయవంతం కావడం చూసిన ప్రధాని మోడీ ఇండియా కూటమిపై దాడి చేయడంతో పాటు మన దేశం పేరును ఉగ్రవాద సంస్థతో పోల్చారని, బానిసత్వానికి చిహ్నమంటూ అపహాస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. ప్రభుత్వ దాడిని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. సమావేశ తీర్మానాన్ని చదివిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు పలు అంశాలపై చర్చించాయని చెప్పారు. దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగంపై అందరూ ఆందోళన వ్యక్తం చేశారని అన్నారు. అదానీపై వచ్చిన తాజా ఆరోపణలపై ప్రధాని ఎందుకు విచారణ జరిపించడం లేదని ఖర్గే నిలదీశారు. గత దశాబ్ద కాలంలో స్వతంత్ర సంస్థలన్నింటినీ నాశనం చేశారని, ఈడీ నుండి సిబిఐ వరకూ ప్రతి స్వయం ప్రతిపత్తి సంస్థ మోడీ ఎదుట సాగిలపడుతోందని నిప్పులు చెరిగారు. మణిపూర్ తగలబడుతుంటే పార్లమెంటును సమావేశపరచలేదని, కోవిడ్ సమయంలోనూ, నోట్ల రద్దు సమయంలోనూ సభను నిర్వహించలేదని, కానీ ఇప్పుడు మాత్రం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఇస్రోకు అభినందన

గతంలోనూ, ఇప్పుడు ఇస్రో సాధించిన విజయాలను ప్రతిపక్ష సమావేశం కొనియాడింది. ఇది ఆరు దశాబ్దాల కృషి అంటూ ప్రశంసించింది. కాగా ఉదయం నుండి మొదలైన చర్చలు మధ్యాహ్నం రెండు గంటల వరకూ కొనసాగాయి. 28 పార్టీలకు చెందిన 48 మంది నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

" చెల్లని వివాహాల" ద్వారా పుట్టిన పిల్లలకు తల్లిదండ్రుల ఆస్తిలో వాటా : సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ : చెల్లని వివాహాల నుంచి పుట్టిన పిల్లలకు తల్లిదండ్రుల ఆస్తిలో వాటా పొందే హక్కు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అలాంటి పిల్లలకు చట్టబద్ధత కల్పించబడుతుందని సుప్రీంకోర్టు శుక్రవారం తన తీర్పులో పేర్కొంది. హిందూ వారసత్వ చట్టాల ప్రకారం మాత్రమే తల్లిదండ్రుల ఆస్తిపై హక్కులు పొందవచ్చని పేర్కొంది. చెల్లని వివాహాల ద్వారా జన్మించిన పిల్లలకు వారి తల్లిదండ్రుల పూర్వీకుల ఆస్తిలో వాటా లేదా హిందూ అవిభాజ్య కుటుంబానికి చెందిన ఆస్తులపై కాపర్సనరీ హక్కు ఉందా అనే చట్టపరమైన సమస్యపై 2011 నుంచి పెండింగ్‌లో ఉన్న పిటిషన్ పై తీర్పు ఇచ్చింది. గత నెల నుంచి ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జెబి పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై పలువురు న్యాయవాదుల వాదనలను విచారించింది. 2011లో సుప్రీంకోర్టు ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ ఇలాంటి పిల్లలకు తల్లిదండ్రుల స్వీయ ఆర్జిత ఆస్తిలో మాత్రమే వాటా ఉంటుందని, వారి పూర్వీకుల కాపర్సెనరీ ఆస్తిలో వాటాను కోరలేరని, అందుకు వారికి అర్హత ఉండదని తీర్పు చెప్పింది. ప్రస్తుతం ఈ తీర్పును అత్యున్నత ధర్మాసనం కొట్టేసింది. లివ్ ఇన్ రిలేషన్ ద్వారా పుట్టిన పిల్లలు వారి పూర్వీకుల ఆస్తిలో వాటాకు అర్హులే అని సుప్రీం అభిప్రాయపడింది.

'రామజన్మభూమి'పై పాఠాలు

- ఎంఎ సిలబస్‌లో నాగ్‌పూర్ వర్శిటీ 'కాషాయ' మార్పులు

న్యూఢిల్లీ : నాగ్‌పూర్ యూనివర్శిటీ (ఎన్‌యు) ఎంఎ చరిత్ర సిలబస్‌లో సిపిఐ చాప్టర్‌ను తొలగించి, 'రామజన్మభూమి ఉద్యమం', బిజెపిలను చేర్చింది. జనసంఘ్‌లోని విభాగాలు, గతంలోని రిపబ్లికన్ పార్టీ అధ్యాయాన్ని యథావిధిగా ఉంచింది. కాంగ్రెస్ మిత్రపక్షం డిఎంకె స్థానంలో బిజెపి మిత్రపక్షం అన్నాడిఎంకెను చేర్చింది. ఖలిస్తాన్ ఉద్యమంలో ఓ అధ్యాయాన్ని కూడా తొలగించినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. "ఇండియన్ మాస్ మూవ్‌మెంట్స్ ఫ్రమ్ 1980-2000" లో రామ జన్మభూమి పేరుతో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి సాగించిన మత ఉద్రిక్తతలను చేర్చింది. 2019లో నాలుగో సెమిస్టర్ కోసం సూచించిన బిఎ చరిత్ర సిలబస్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ను చేర్చిన సంగతి తెలిసిందే.

కోమ్ కమ్యూనిటీకి భద్రత కల్పించండి

- అమిత్‌షాకు మేరీకోమ్ లేఖ

ఇంఫాల్ : మణిపూర్‌లో చెలరేగిన హింస ఇప్పటికీ ఆగే సూచనలు కనిపించడం లేదు. తనకు, కోమ్ కమ్యూనిటీకి భద్రత కల్పించాలని బాక్సింగ్ స్టార్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత ఎంపీ మేరీకోమ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. మణిపూర్‌లోని కోమ్ గ్రామాల్లోకి చొరబడుతున్న రెండు గ్రూపులను భద్రతా బలగాలు నిరోధించేలా జోక్యం చేసుకోవాలని మేరీ కోమ్ కోరారు. కోమ్ కమ్యూనిటీ అనేది మణిపూర్‌లోని ఆదివాసీ తెగ అని, ఇది మైనారిటీలలో అతి చిన్నదని, అందుకే అది ఏ శక్తివంతమైన వర్గంతోనూ పోరాడలేకపోతుందని లేఖలో పేర్కొన్నారు. గురువారం అమిత్ షాకు రాసిన లేఖలో.. మణిపూర్‌లోని ఆదివాసీ తెగ అయిన కోమ్ కమ్యూనిటీ మైనారిటీలలో అతి చిన్నదని అన్నారు. తమ కమ్యూనిటీపై దాడులు జరుగుతాయనే భయాందోళనలతో ఉన్నామని, అన్ని సమస్యల మధ్య చిక్కుకున్నామన్నారు.





మీకోసం

ఇంట్లో వేస్ట్‌గా ఉన్న ప్లాస్టిక్ డబ్బా మూతకి రంధ్రాలు చేసి స్పూన్‌లు, ఫోర్కులు లాంటివి పెట్టుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది.

జీవన సౌరభం

ప్రయత్నించేందుకు ఎప్పుడూ విఫలం కావొద్దు.

మంచి అలవాట్లు




సాగర్‌కు మంచి అలవాట్లు లేవు. ముఖం కడుక్కోకుండా పాలు తాగడం, స్నానం చేయకుండా బడికి వెళ్లడం వంటివి చేస్తుండేవాడు. తల్లితండ్రులు ఎంత చెప్పినా వినే వాడు కాదు. స్కూలుకు చింపిరి జుట్టుతో రావద్దని టీచర్లు కోప్పడేవారు. దీంతో స్కూలుకు వెళ్లడం మానేశాడు. చదువుకోకుండా పిల్లాడి భవిష్యత్తు ఏమవుతోందని తల్లిదండ్రులు తెగ గాబరా పడ్డారు. 'గారాబం చేసి పిల్లాడిని చెడగొట్టాం' అని బాధపడ్డారు.

ఒక రోజు సాగర్‌కు వరుసకు అన్నయ్య అయ్యే సుమంత్ వాళ్లింటికి వచ్చాడు. అతను పట్నం స్కూల్లో టీచరు. సాగర్ గురించి తల్లిదండ్రులు సుమంత్‌తో చెప్పారు. ఎలాగైనా సాగర్‌లో మార్పు తేవాలని వేడుకున్నారు. 'మీరేం కంగారు పడవద్దు. తమ్ముడిని నేను మారుస్తాను' అని సుమంత్ వాళ్లతో చెప్పాడు. రెండు రోజుల పాటు సాగర్‌ను గమనించిన సుమంత్ మూడో రోజు అతనిని దగ్గరకు పిలిచి 'చూడు సాగర్ నీ పద్ధతి ఏం బాగాలేదు. నీ కంటే చిన్న పిల్లలు కూడా స్కూలుకి క్రమం తప్పకుండా వెళుతున్నారు. అలాగే స్కూలుకి ఎలా పడితే అలా వెళ్లకూడదు. రోజూ ఉదయాన్నే లేవాలి, పండ్లు తోమాలి, స్నానం చేయాలి. ఉతికిన బట్టలతో, తల దువ్వుకుని స్కూలుకు వెళ్ళాలి. అలా వెళితేనే నిన్ను అందరూ ప్రేమిస్తారు. టీచర్లు కూడా నిన్ను ఏమీ అనరు. నువ్వు ఇలా ఉంటే అమ్మానాన్న ఎంత బాధపడుతున్నారో తెలుసా? ఇక నుండి నీ పద్ధతి మార్చుకో' అని చెప్పాడు.

అప్పటికే స్కూలుకు వెళ్లకుండా నిరుత్సాహంగా ఉన్న సాగర్‌పై ఆ మాటలు బాగా పనిచేశాయి. చూస్తుండగానే తన అలవాట్లలో మార్పు వచ్చింది. వేళకి లేచి, క్రమం తప్పకుండా స్కూలుకి వెళుతున్నాడు. కొడుకులో వచ్చిన మార్పు చూసి తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు.

- కనుమ ఎల్లారెడ్డి,
93915 23027.



కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న మూడు చేపల్లో ఒకదానికి సంబంధించిన గిఫ్ట్ ఎదురుగా ఉంది. అది ఏ చేపదో మీరు కనిపెట్టండి చూద్దాం.

నేను చేసిన బొమ్మ



ప్రైజీ ఏంజెల్,
3వ తరగతి,
శ్రీ చైతన్య స్కూలు,
కొత్తపేట.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చూపు లేదు.. అయితేనేం..!



'రిస్క్ చేయొద్దు.. చాలా ప్రమాదం' అని ఎంతోమంది హెచ్చరించినా అతడు ఎలక్ట్రికల్ వస్తువుల మరమ్మత్తు పనులను చేస్తూనే ఉన్నాడు. ఒకటి, రెండు కాదు; పదేళ్లుగా అదే పనిలో ఉండి ఈ ఏడాదే సొంతంగా మరమ్మతు దుకాణం ప్రారంభించాడు. ఆ పని చేయొద్దని అతన్ని ఎందుకు వారించారంటే.. తన పని తాను చేసుకోవడానికే ఇబ్బందిపడే అంధుడు అతడు. తమిళనాడు కోయంబత్తూర్‌కి చెందిన సురేష్ మొదట సీలింగ్ ఫ్యాన్లు మరమ్మతు చేసే దుకాణంలో పనికి కుదిరాడు. అసలు పట్టుమని పదిరోజులైనా వస్తాడా అనుకున్న యజమాని ఆశ్చర్యపోయేలా పని నేర్చుకున్నాడు సురేష్. ఈ పదేళ్లలో ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, కూలర్లు, ఏసీలు వంటి పెద్ద పెద్ద ఉపకరణాల మరమ్మతులను అలవోకగా చేసే స్థాయికి ఎదిగాడు. 'మారీ ఎలక్ట్రికల్స్' పేరుతో కవుందంపాలాయంలో సురేష్ నిర్వహిస్తున్న ఆ షాపు చూసిన వారంతా 'అతని దృష్టికే లోపం వుంది కానీ.. శరీరానికి కాదు.. అందుకే ఒళ్లంతా కళ్లు చేసుకుని పని చేసుకుంటున్నాడు' అంటూ ఆశ్చర్యపోతున్నారు.

ఆరేళ్ల వయసున్నప్పుడు మెదడువాపు వ్యాధి సోకి సురేష్‌కి చూపు పోయింది. బడికి వెళ్లాడే గాని చదువు సాగలేదు. దీంతో ఐదో తరగతితో చదువు ఆపేశాడు. చదువు సాగకపోయినా చిన్న తనం నుంచీ ఎలక్ట్రానిక్ ఉపకరణాల మరమ్మతులు చేయడం అతనికి ఆసక్తి. చూపు లేకపోయినా ఇంట్లో ఉన్న రేడియో ఊడదీసి అందులో ఉన్న వస్తువులను చేతితో తాకుతూ, శబ్దాలు వింటూ ఏ వస్తువు ఎలా పనిచేస్తోందో పరిశీలించేవాడు. చిన్నతనంలో ఏర్పడిన ఈ ఆసక్తే అతన్ని మెకానిక్ వైపు నడిపిస్తుందని అతడు అప్పుడు ఊహించలేదు. అనారోగ్యంతో తండ్రి మరణించాడు. తల్లి మానసికంగా కుంగిపోయింది. ఈ పరిస్థితుల్లో ఐదుగురు తోబుట్టువులలో ఒకడైన సురేష్‌కి ఏదో ఒక పని చేసుకోక తప్పనిసరి పరిస్థితి. ఆసక్తి ఉన్న మెకానిక్ పనివైపు వెళ్దామనుకున్నాడు. అయితే చూపు లేని అతనికి పని ఎవరు ఇస్తారు?

ఆ వ్యక్తి.. శరవనంపట్టి కృష్ణమూర్తి. కస్టమర్ల వివరాలు, వారు అప్పజెప్పిన వస్తువులను నమోదు చేసుకునే పనిని



మొదట సురేష్‌కి అప్పజెప్పాడు కృష్ణమూర్తి. నిదానంగా అతనిలో ఉన్న ఆసక్తిని గమనించి మరమ్మతు పనులలో శిక్షణ ఇప్పించాడు. నాలుగేళ్ల గృహ ఎలక్ట్రికల్ ఉపకరణాల మరమ్మతుల్లో తర్ఫీదు పొందిన సురేష్ ఆ తరువాత మరో ఆరేళ్లు మణికందన్ షాపులో నిర్మాణరంగంలో ఉపయోగించే ఇండస్ట్రీయల్ పవర్ టూల్స్ మరమ్మతు పనులు నేర్చుకున్నాడు. ఈ పదేళ్ల అనుభవంతోనే ఇప్పుడు సొంతంగా షాపు నిర్వహిస్తున్నాడు.

సురేష్ గురించి అతని స్నేహితుడు వినోద్, 'నేను మొదట సురేష్‌ని చూసి చాలా ఆశ్చర్యపోయాను. శిక్షణ తీసుకుంటున్నప్పటి నుండే సురేష్ నాకు స్నేహితుడు. తమలో ఉన్న ప్రతిభని, సామర్థ్యాన్ని గుర్తించేది చాలా తక్కువమంది. వారిలో సురేష్ ఒకరు' అని చెప్పాడు.

'మా పెద్దక్క షాపు అద్దె కట్టింది. నా స్నేహితులు వినోద్, కొలంబస్ సాయంతో ఆరు నెలలుగా ఈ షాపు నిర్వహిస్తున్నాను. ప్రజలు నన్ను నమ్మి షాపుకు వస్తున్నారు. నాకు చాలా సంతోషంగా ఉంటోంది. భవిష్యత్తులో నాలాంటి వారికి ఈ పనిలో శిక్షణ ఇస్తాను. మెరుగైన జీవనోపాధి కోసం ఆసక్తి ఉన్న ఏ పనిలోనైనా రాణించే అవకాశం అందరికీ ఉంటుంది. ప్రోత్సాహం ఉండాలి. మాపై నమ్మకం ఉంచాలి' అంటున్నాడు సురేష్. వైకల్యంతో బాధపడుతున్న సురేష్ లాంటి ఎంతోమంది వ్యక్తులు ఏదో ఒకపనిలో తమను తాము నిరూపించుకుంటూ ముందుకుసాగుతూనే ఉంటారు. ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తున్న వారు ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నారు.

ఉసిరి వల్ల ఎన్ని లాభాలో ...

రాబోయే కాలంలో మార్కెట్లో ఉసిరి కాయలు లభ్యమవుతాయి. చాలామంది ఈ ఉసిరితో నిల్వ పచ్చళ్లు చేసుకుంటారు. కొందరైతే గింజలను తీసేసి కాయలను ఎండబెట్టి నిల్వ చేసుకుంటారు. బోలెడు ప్రయోజనాలున్న ఉసిరిని ప్రతి ఒక్కరూ తప్పక వాడాలి. ఎండబెట్టిన ఉసిరికాయ ముక్కలను రోజుకి 1 లేదా 2 తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

విటమిన్లు-మినరల్స్ : తాజా ఉసిరికాయలోనే కాదు.. ఎండిన ఉసిరి ముక్కల్లోనూ యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటాయి. ఉసిరిలో ఉండే విటమిన్ సి ఎండిన తర్వాత యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది శరీరాన్ని ఫ్రీ ర్యాడికల్స్ నుంచి రక్షిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులు రావు.



అజీర్తి దూరం చేస్తుంది : ప్రతిరోజూ ఎండిన ఉసిరి తింటే.. అజీర్తి సమస్య తగ్గుతుంది. జీర్ణశక్తి మెరుగుపడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరు కూడా మెరుగ్గా ఉంటుంది.

జుట్టు సమస్య ఉండదు : జుట్టు రాలడం వంటి సమస్యతో బాధపడే వారికి ఎండిన ఉసిరి మంచి పరిష్కారం. ఉసిరి ముక్కల్ని తినడం వల్ల శిరోజాలు రాలడం తగ్గి.. ఆరోగ్యంగా, పొడవుగా పెరుగుతాయి. కుదుళ్లు కూడా దృఢంగా ఉంటాయి.

వాపులకు చెక్ : ఎండిన ఉసిరి ముక్కల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంపై వచ్చే వాపులు, ఒత్తిడిని తగ్గిస్తాయి. అలాగే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించడంలో సహాయపడుతాయి.

చర్మానికి మేలు : రోజూ రెండు ఎండిన ఉసిరి ముక్కలను తింటే.. చర్మం కాంతివంతంగా ఉంటుంది. చర్మంపై త్వరగా ముడతలు రావు. మొటిమలు, మచ్చలు తగ్గి యవ్వనంగా కనిపిస్తారు. ఆందోళన, వణుకు, మతిమరుపు, నరాల బలహీనత వంటి అనారోగ్య సమస్యలు సైతం తగ్గుతాయి.

పోలీసుల అత్యుత్సాహం

- అయన్నపాత్రుడి నిర్బంధం
- 41ఎ నోటీసులిచ్చి, విడుదల

ప్రజాశక్తి- నక్కపల్లి, అమరావతి బ్యూరో

టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును విశాఖ ఎయిర్ పోర్టులో పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కారులో తీసుకెళ్లి యలమంచిలి వద్ద 41 ఎ నోటీసు ఇచ్చి విడిచిపెట్టారు. అయ్యన్నపాత్రుడు శుక్రవారం హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖ ఎయిర్ పోర్టుకు వచ్చారు. అక్కడి నుంచి బయటకు రాగానే ఆయనను హనుమాన్ జంక్షన్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో ఎక్కించుకొని విజయవాడ వైపు తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోని కాగిత టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. ఈలోగా అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం దాటిన తర్వాత పోలీసులు సిఆర్‌పిసి 41 ఎ నోటీసు ఇచ్చి ఆయనను విడిచిపెట్టారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లా గన్నవరంలో ఇటీవల నిర్వహించిన బహిరంగ



పోలీసులు ఇచ్చిన 41ఎ నోటీసును చూపుతున్న అయ్యన్నపాత్రుడు

సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై అయ్యన్న అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మాజీ మంత్రి పేర్ని నాని ఫిర్యాదు చేశారు. దీంతో, అయ్యన్నపై 153 ఎ, 354 ఎ1 (4), 504, 505 (2), 509 ఐపిసి సెక్షన్ల కింద గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు నోటీసు ఇచ్చారు.


భయపడే ప్రసక్తే లేదు : అయ్యన్న

పోలీసులు విడిచిపెట్టిన అనంతరం కాగిత టోల్‌గేట్ ఉన్న ఒక హోటల్ వద్ద విలేకర్లతో అయ్యన్న మాట్లాడారు. తాళ్లపాలెం దాటిన తర్వాత సిఐకి ఫోను వచ్చిందని, కారు ఆపి బయటకు వెళ్లి కొంతసేపు మాట్లాడిన తర్వాత సిఆర్‌పిసి 41 నోటీసు ఇచ్చి తనను విడిచిపెట్టారని చెప్పారని, పది రోజులలోపు స్టేషన్‌కు రావాలని తనతో సిఐ చెప్పారని తెలిపారు. పోలీసు కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. విషయం తెలుసుకున్న చంద్రబాబునాయుడు... అయ్యన్నతో ఫోన్లో మాట్లాడారు.

అయ్యన్నపై అక్రమ కేసు : చంద్రబాబు

ప్రభుత్వాన్ని గట్టిగా విమర్శించే అయ్యన్నపాత్రుడిపై అక్రమ కేసులు, అరెస్టుతో కక్ష సాధిస్తున్నారని టిడిపి అధినేత చంద్రబాబు విమర్శించారు. 41ఎ నోటీసు ఇవ్వడానికే పోలీసులు వచ్చి ఉంటే కిడ్నాప్ తరహాలో ఎయిర్‌పోర్టు నుంచి తీసుకెళ్లి నిర్బంధించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు, లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై పోలీసులు ఎందుకు కేసు పెట్టలేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య వేరొక ప్రకటనలో ప్రశ్నించారు.

'ఓజీ' టీజర్‌కి వేళాయే!



పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న ఓజీ' చిత్రం నుండి సెప్టెంబరు 2న(ఈ రోజు) టీజర్ విడుదలవుతోంది. ఉదయం 10.35 గంటలకు ఈ టీజర్ రానుందని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్ ట్వీట్ చేసింది. ఈ టీజర్ 70 సెకన్ల నిడివితో ఉంటుందని సమాచారం. నటుడు అర్జున్ దాస్ వాయిస్ ఓవర్‌తో ఎలివేషన్ డైలాగ్స్‌తో ఈ టీజర్‌ని సిద్ధం చేశారు. సుజీత్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 50 శాతానికి పైగానే పూర్తి చేసుకున్నట్టు మేకర్స్ తెలిపారు.. ఈ ఏడాది చివరికి ఈ సినిమాని విడుదల చేయాలని అనుకుంటున్నట్టు సమాచారం.



మలయాళ నటి అపర్ణ మృతి

మలయాళ నటి అపర్ణా నాయర్ గురువారం రాత్రి మృతి చెందారు. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. కుటుంబ కలహాల కారణంగానే అపర్ణా నాయర్ సూసైడ్ చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

సలార్' విడుదల వాయిదా?



ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' మొదట ప్రకటించినట్లుగా ఈనెల 29న విడుదల కావాల్సివుంది. 6న ట్రైలర్ విడుదల చేయాల్సివుంది. 'బాహుబలి'తో తర్వాత సాహో, రాధేశ్యామ్, ఆదిపురుష్ సినిమాలు మెప్పించలేక పోయాయి. ఇప్పుడు ఆశలన్నీ 'సలార్'పై పెట్టు కున్నారు ప్రభాస్. కేజీఎఫ్ ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకుడు కావడమే దీనికి కారణం. ఆయనకు సర్జరీ జరగనున్నందున డిసెంబర్‌కు వాయిదా పడిందనే ఊహాగానాలు వస్తున్నాయి.

నవ్‌లఖా హౌస్ అరెస్టు ఓ తప్పుడు ఉదాహరణ : సుప్రీం

న్యూఢిల్లీ : ఎల్గార్ పరిషత్ - మావోయిస్టు సంబంధాల కేసులో ఉద్యమకారులు గౌతమ్ నవ్‌లఖాను హౌస్ అరెస్టులో ఉంచడం 'ఒక తప్పుడు ఉదాహరణ' అవుతుందని సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. నవ్‌లఖా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. నవ్‌లఖా 2022 నుంచి ముంబయిలో పబ్లిక్ లైబ్రరీలో హౌస్ అరెస్టులో ఉన్నారు. తన వసతి మార్చాలని నవ్‌లఖా దాఖలు చేసిన పిటీషన్‌ను శుక్రవారం జస్టిస్ ఎంఎం సురేష్, జస్టిస్ జెబి పార్దివాలాలతో కూడిన ధర్మాసనం విచారించింది. నవ్‌లఖా తరుపున సీనియర్ న్యాయవాది నిత్యా రామకృష్ణన్ తన వాదనలు వినిపిస్తూ 'ఈ పిటిషన్‌పై తమ ప్రతిస్పందన తెలియజేయాలని ఏప్రిల్‌లో ఎన్‌ఐఎను సుప్రీంకోర్టు ఆదేశించిందని, ఇప్పటి వరకూ తన ప్రతిస్పందన తెలియజేయలేదని' తెలిపారు. ఎన్‌ఐఎ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వాదనలు వినిపిస్తూ 'అనారోగ్యం కారణంగానే నవ్‌లఖాను హౌస్ అరెస్టులో ఉంచారు' అని తెలిపారు. హౌస్ అరెస్టులో భద్రత కోసం పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచడానికి ఖర్చుల నిమిత్తం కనీసం రూ.20 లక్షలు చెల్లించేవిధంగా నవ్‌లఖా ఆదేశించాలని కూడా సుప్రీంకోర్టును కోరారు. ఈ వాదనలు విన్న సుప్రీంకోర్టు నాలుగు వారాల్లోగా నవ్‌లఖా ఆరోగ్య స్థితిపై నివేదిక ఇవ్వాలని ఎన్‌ఐఎను ఆదేశించింది.

అందరిలోనూ ఉత్కంఠ..!

- నేడు భారత్-పాకిస్తాన్ మ్యాచ్
- వరణుడి ముప్పు..?
- మధ్యాహ్నం 3.00గం॥ల నుంచి

కాండీ : ఆసియాకప్-2023లో భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌కు సమయం ఆసన్నమైంది. కాండీ వేదికగా శనివారం భారత్-పాకిస్తాన్ మ్యాచ్ జరగనుంది. ఆసియాకప్‌లో పాకిస్తాన్‌పై భారత్‌దే పైచేయి. ఈ హైవోల్టేజ్ మ్యాచ్‌కు భారత్ అన్ని విధాలా సన్నద్ధమైంది. టాప్‌ఆర్డర్ బ్యాటర్స్‌తోపాటు మిడిలార్డర్, ఆల్‌రౌండర్ల కలయికతో భారతజట్టు దుర్భేద్యఫామ్‌లో ఉంది. వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌తోపాటు జస్ప్రీత్ బుమ్రా చాలాకాలం తర్వాత పాకిస్తాన్‌పై యార్కర్లు సందించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఆల్‌రౌండర్ల కోటాలో హార్దిక్, జడేజా జట్టుకు కొండంత అండగా ఉండనే ఉన్నారు. పోరుకు భారత ప్లేయింగ్ ఎలెవన్‌ను కూడా జట్టు మేనేజ్‌మెంట్ ఖారారు చేసింది. హైదరాబాద్‌కు చెందిన తిలక్ వర్మ ఈ మ్యాచ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేయడం ఖాయం. వన్డేల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న సూర్యకుమార్ యాదవ్ స్థానంలో మేనేజ్‌మెంట్ తిలక్‌కు చోటు కల్పించినా ఆశ్చర్యపోన్నక్కర్లేదు. టి20ల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న సూర్యకుమార్.. వన్డేల్లో మాత్రం తేలిపోతున్నాడు. దాంతో తొలి మ్యాచ్‌లో అతడిని బెంచ్‌కే పరిమితం చేసినట్లు సమాచారం. మరోవైపు వెస్టిండీస్‌తో టి20ల్లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన తిలక్ వర్మ నిలకడగా రాణిస్తున్నాడు. ఆరంగేట్రంలోనే అద్భుతమైన ప్రదర్శనతో అకట్టుకున్నాడు. ఇక రోహిత్‌కు జోడీగా కిషన్‌ను ఓపెనర్‌గా, శుభ్‌మన్‌ను గిల్ ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు పంపే సూచనలు ఉన్నాయి.



ఇక పాకిస్తాన్ విషయానికొస్తే.. తొలి లీగ్ మ్యాచ్‌లో నేపాల్‌పై ఏకంగా 238పరుగుల తేడాతో గెలిచింది. కెప్టెన్ బాబర్, ఇప్తికార్ అహ్మద్ ఫామ్‌లో ఉండడం ఆ జట్టుకు కలిసిరానుంది. బ్యాటింగ్‌కంటే పాకిస్తాన్ జట్టు బౌలింగ్‌పైనే ప్రధానంగా ఆధార పడింది. ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య జరిగే ఆసియాకప్ మ్యాచ్ ప్రాధాన్యతను సంతరించుకుంది.

వర్షం ముప్పు..?

మరోవైపు ఈ మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా నిలిచే సూచనలున్నాయని శ్రీలంక వాతావరణ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. శనివారం మ్యాచ్ జరిగే సందర్భంలో వర్షం కురిసే సూచనలున్నాయని, 50 ఓవర్ల కోటా పూర్తి మ్యాచ్ జరగడం కష్టమేనని వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం కూడా చెదురుమదురు జల్లులు కురవడంతో గ్రౌండ్‌మన్లు పిచ్‌ను పూర్తిగా కవర్లతో కప్పి ఉంచారు.

జట్లు..

భారత్: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, శ్రేయస్, ఇషాన్(వికెట్ కీపర్), హార్దిక్, జడేజా, శార్దూల్, కుల్దీప్, షమీ, బుమ్రా, సిరాజ్, అక్షర్, సూర్యకుమార్, ప్రసిధ్ కృష్ణ, తిలక్ వర్మ.

పాకిస్తాన్: ఫకర్, ఇమామ్, బాబర్(కెప్టెన్), రిజ్వాన్(వికెట్ కీపర్), అఘా సల్మాన్, ఇప్తికార్, నవాజ్, షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, హారీస్ రవూఫ్, ఫహీమ్ అష్రాఫ్, హ్యారీస్, వాసీం జూనియర్, షఫీక్, షకీల్, ఒసామా మిర్.

మూడోరౌండ్‌కు అల్కరాజ్

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ మూడోరౌండ్‌కు టాప్‌సీడ్, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్ ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో అల్కరాజ్ 6-3, 6-1, 7-6(7-4)తో హారిన్(దక్షిణాఫ్రికా)ను వరుససెట్లలో ఓడించాడు. ఇక రష్యాకు చెందిన 3వ సీడ్ మెద్వదెవ్ 6-2, 6-2, 6-7(6-8), 6-2తో ఒకానెల్(ఆస్ట్రేలియా)ను, 8వ సీడ్ రుబ్లేవ్ 6-4, 6-3, 2-6, 6-1తో మోన్‌ఫీల్(ఫ్రాన్స్)ను చిత్తుచేశారు. ఇక ఇంగ్లండ్ మాజీ నంబర్‌వన్ ఆటగాడు ఆండీ ముర్రే 3-6, 4-6, 1-6తో 19వ సీడ్ డిమిట్రోవ్(బల్గేరియా) చేతిలో ఓటమిపాలవ్వగా.. 12వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ) 7-6(7-1), 3-6, 6-4, 6-3తో సహచర ఆటగాడు అల్టేయర్‌ను చిత్తుచేశాడు. మరో పోటీలో 17వ సీడ్ పోలండ్‌కు చెందిన హుర్కోజ్ 2-6, 4-6, 5-7తో డ్రేవెన్(బ్రిటన్) చేతిలో అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు.

స్విటోలినా, కసట్కినా కష్టంగా..

మహిళల సింగిల్స్‌లో 13వ సీడ్, కసట్కినా, 25వ సీడ్ స్విటోలినా కష్టంగా గెలిచారు. ఉక్రెయిన్‌కు చెందిన స్విటోలినా 5-7, 6-4, 6-4తో రష్యాకు చెందిన పావ్లియుచెంకోవాపై, రష్యాకు చెందిన కసట్కినా 2-6,న 6-4, 6-4తో అమెరికాకు చెందిన కెనిన్‌ను ఓడించారు. ఇతర పోటీల్లో 3వ సీడ్ పెగూలా 6-3, 6-1తో పిఎం టింగ్(రొమేనియా)పై, 5వ సీడ్, ట్యునీషియాకు చెందిన జబీర్ 7-5(9-7), 4-6, 6-3తో నోస్కోవా(చెక్)పై చెమటోడ్చి నెగ్గారు.

నీరజ్ త్రో.. ఫెదరర్ వీక్షణ





జ్యూరిచ్: జూరిచ్‌లో జరుగుతున్న డైమండ్ లీగ్ పోటీల్లో భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా సత్తా చాటాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈవెంట్‌లో నీరజ్ 85.71మీ. విసిరి రెండో స్థానంలో నిలిచాడు. లెజ్జిగ్రౌండ్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలను వీక్షించేందుకు సుమారు 25వేల మంది ప్రేక్షకులు హాజరుకాగా.. ప్రధాన ఆకర్షణగా టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ నిలిచాడు. నీరజ్ ప్రాతినిధ్యం వహించిన జావెలిన్ త్రో పోటీలను ఫెదరర్, భార్య మిర్కా, కుమార్తెలు ఛార్లెనె రివా, మైలా రోజ్‌లతో కలిసి వీక్షించాడు. అలాగే ఫెదరర్ తల్లిదండ్రులు రాబర్ట్, లైనెట్టె కూడా వీక్షించారు. ఫెదరర్ కుటుంబ సభ్యులతో కలిసి జావెలిన్ త్రో పోటీలను చూస్తున్న ఫొటోలను అభిమానులు ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68